Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

జిమ్మిక్కైమ
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జిమ్మిక్కైమ

సంపుటి: 82 • సంచిక: 4 • 28-1-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



● నెల్లూరు కీర్తి పతాకను గగనంలో సగర్వంగా ఎగురవేసిన

పద్మభూషణులు జివికె, బాలు!

కొందరు వ్యక్తులకు బిరుదులు, సన్మానాలతో ప్రతిష్ట పెరుగుతుంది. మరికొందరికి అవి ఇస్తే ఆ బిరుదులకే గౌరవం పెరుగుతుంది. ఈ రెండవ కోవకు చెందినవారు జివికె, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఇద్దరికి ఇద్దరూ తమ రంగాలలో ఎంతటి లబ్ధ ప్రతిష్టులో వివరించి చెప్పనవసరం లేదు. వారిద్దరినీ పద్మభూషణ బిరుదంతో సత్కరించింది కేంద్రప్రభుత్వం. భారతదేశంలో మూడవ అత్యున్నత పౌర పురస్కారం ఇది. భారత రత్న, పద్మవిభూషణ్ బిరుదులు దీనిపైన వుంటాయి. పద్మశ్రీ ఒక మెట్టు దిగువ వుంటుంది. 1954 నుంచి ఈ అవార్డులు ఇస్తున్నారు. దేశానికి తమ తమ రంగాలలో అనుపమానమైన సేవలందించిన వ్యక్తులను గుర్తించి, గౌరవించడమే వీటి వుద్దేశ్యం.




నెల్లూరు జిల్లాకు పద్మభూషణ పురస్కారం లభించడం ఇది రెండవసారి. శాంత బయోటెక్ కంపెనీ స్థాపించి, హెపటైటిస్ సి వంటి ప్రాణాంతక వ్యాధికి చవక ధరలో వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చిన నెల్లూరీయుడు వరప్రసాదరెడ్డికి నాలుగేళ్ల క్రితమే ఈ అవార్డు లభించింది. దాని తర్వాత అరుదైన గౌరవం పొందిన నెల్లూరీయులు జివికె, ఎస్పీ బాలు.

జగమెరిగిన బ్రాహ్మడికి జంద్యం అవసరం లేనట్లే, లోకానికంతా గాన గంధ్వరుడిగా పరిచయమైన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గొప్పదనం వివరించి చెప్పనవసరం లేదు. ఆయన కీర్తికి ఆకాశమే హద్దు. దాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి నెల్లూరీయుడు కావడం నెల్లూరు జిల్లా చేసుకున్న పుణ్యం. తిప్పరాజువారి వీధిలో, హార్మోనియం పెట్టె పట్టుకొని, కూనిరాగాలు ఆలపిస్తూ తిరిగిన బాలసుబ్రహ్మణ్యం, తన తియ్యటి పాటలతో లోకమంతటి మీద గానమకరందపు జల్లు కురిపిస్తాడని ఎవరూ వూహించి వుండరు. ఆ తియ్యా తేనియ సుధా ప్రవాహంలో కోట్లాదిమంది జనులను ఓలలాడిస్తాడనీ కలగని వుండరు.

సినీ పరిశ్రమలో ఆయన స్పర్శ సోకని శాఖ లేదు. పాటలు పాడాడు. సంగీత దర్శకత్వం వహించాడు. సినిమాలు తీశాడు. భిన్నపాత్రలలో నటించాడు. టివి ఛానళ్ల ద్వారా మట్టిలో మాణిక్యాల వంటి గాయకులెందరినో వెలికి తీశాడు. కమలహసన్ వంటి అగ్రనటులకు డబ్బింగ్ చెప్పాడు. ఒక్క తెలుగు సినీ పరిశ్రమలోనే కాదు, ప్రపంచం మొత్తం మీద ఆయన వలె బహు భాషలలో పాటలు పాడిన గాయకుడు మరొకరు వుండరు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, మరాఠి, బెంగాలీ, ఒరియా, పంజాబీ, తుళు, గొండి, సంస్కృత భాషలలో కొన్ని వేల పాటలు పాడాడు బాలసుబ్రహ్మణ్యం. బిరుదులు, సత్కారాలు ఆయనకు చాలా మామూలు విషయాలు. ప్రపంచంలోని అత్యధిక పాటలు పాడిన గాయకుడిగా ఆయన పేరు గిన్నీస్ రికార్డులకు ఎక్కింది. నాలుగు విశ్వవిద్యాలయాలు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశాయి. 2001లో పద్మశ్రీ బిరుదం లభించింది. నేపథ్య గాయకుడిగా జాతీయ అవార్డు లభించింది. కళా సంస్థలు ఇచ్చిన బిరుదులు చేసిన సత్కారాలు లెక్కే లేదు. వీటన్నిటికీ తలమానికం వంటిది పద్మభూషణ్ అవార్డు ప్రదానం. ఆ అవార్డుకే గౌరవం పెరుగుతున్నది, బాలసుబ్రహ్మణ్యానికి అది దక్కడం ద్వారా. ఆయనకు మా మనఃపూర్వక అభినందనలు.



పద్మభూషణ్ బిరుదాంకితుడైన తొలి నెల్లూరీయుడు కె.వరప్రసాద్‌రెడ్డి



గాన లోకంలో ఎస్పీ బాలు ధ్రువ తార అయితే, పారిశ్రామిక ప్రపంచంలో జివికె ఒక వెలుగు దివ్వె. గునుపాటి వంశానికి మణిదీపం వంటి వాడాయన. ఆయన నెల్లూరుజిల్లా వాసి కావడం మనకందరికీ గర్వకారణం. అందరు గునుపాటి వంశస్తుల వలెనే కాంట్రాక్టర్‌గా జీవితం ప్రారంభించిన ఆయన పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి అంచలంచలుగా పైకి ఎదిగాడు. ఇటుక ఇటుక పేర్చుకొంటూ పారిశ్రామిక సామ్రాజ్యాన్ని నిర్మించాడు. అదేమీ పూలబాటలో ప్రయాణం కాదు. ఎన్నో అవరోధాలు, ఎన్నెన్నో ఆటంకాలు, ప్రతిబంధకాలు, ప్రతికూలతలు ఎదుర్కొని, వాటన్నిటినీ అధిగమించి, సఫలీకృతుడైనాడు. ఆయన చేపట్టిన మొట్టమొదటి పరిశ్రమ – బంజారా హోటల్. 1972లో, సగం నిర్మాణ దశలో వున్నప్పుడు ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యాడాయన. 1979లో నూవాపాన్ పరిశ్రమ ప్రారం

కొరవ 14వ పేజీలో

నల్లధనంపై చేతులెత్తేసిన కేంద్రం!

దేశం సరిహద్దులు దాటి, విదేశాలలో భద్రంగా దాగి వున్న నల్లధనం విషయంలో తాము చేయగల్గింది ఏదీ లేదని ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ చేతులెత్తేశాడు. నల్లధనం వెలికి తీతలో మీకెందుకంత మొద్దు నిద్ర అని సాక్షాత్తు సుప్రీంకోర్టు గట్టిగా మొట్టికాయలు వేసిన తర్వాత ఆయన ప్రజలకు చెప్పిన నిజం అది. భారతీయ సంపన్నులు విదేశాలలో దాచి వుంచిన నల్లధనం పై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. దాని విలువపై ఎవరికి తోచిన లెక్కలు వారు చెప్తున్నారు. 20 లక్షల కోట్ల నుంచి 75 లక్షల కోట్ల వరకు వెళ్తున్నాయి అంచనాలు. ఇదంతా దేశాన్ని కొల్లగొట్టిన సొత్తే అని వ్యాఖ్యానించింది సుప్రీంకోర్టు. దేశ ప్రజలందరి అభిప్రాయం కూడా అదే.

పన్ను ఎగ్గొట్టిన వ్యాపారులు, చట్టాలను ఉల్లంఘించే పారిశ్రామిక సంస్థలు, ఖజానాకు అవినీతి కన్నం పెట్టే రాజకీయనేతలు, వున్నతాధికారులు, నేర సామ్రాజ్యాలు స్థాపించిన మాఫియా ముఠాలు కొన్ని దశాబ్దాలుగా తమ అక్రమార్జనను విదేశాలకు తరలించడం ఒక ఆనవాయితీ అయిపోయింది. ఇటువంటి అక్రమార్కులకు స్వర్గధామం స్విట్జర్లాండ్. ఏ దేశం నుంచి ఎవరు ఎంత సొమ్ము తెచ్చి, తమ దగ్గర దాచినా వారి గుట్టుమట్లు బయటపెట్టకుండా రహస్యం కాపాడడం ఆ దేశం వ్యాపారం. దాన్ని చూసి బహామాస్, బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్స్, సెయింట్ కీట్స్, అర్జెంటీనా, మార్షల్ ఐల్యాండ్స్ వంటి చిన్నా చితక దేశాలన్నీ దీన్నొక వ్యాపారంగా మార్చుకొన్నాయి. తమ బ్యాంకులలో డబ్బు దాచుకొనేవారి దగ్గర భారీ రుసుము వసూలు చేయడం, వడ్డీలేని ఆ డబ్బుతో తమ దేశ అవసరాలు తీర్చుకోవడం ఆ దేశాల ఆర్థిక విధానం. ప్రపంచం లోని దాదాపు అన్ని దేశాల నుంచి అక్రమార్జనా పరులు ఈ దేశాల దగ్గర దాచి వుంచిన దొంగ సొత్తు విలువ ఎన్ని లక్షల కోట్ల రూపాయలో లెక్క కట్టడం అసాధ్యం. అమెరికాపై అల్ ఖైదా దాడుల తర్వాత ప్రపంచం యావత్తు దృష్టి ఈ నల్లధనం నిల్వలపై పడింది. అల్ ఖైదా వంటి తీవ్రవాద సంస్థలకు ఈ నల్లధనం నిల్వ నుంచే నిధులు అందుతున్నాయన్న అనుమానంతో అమెరికా, బ్రిటన్ వంటి అగ్రరాజ్యాలు, ఈ దేశాల మీద ఒత్తిడి పెంచాయి. బ్యాంకులలో నల్లధనం దాచి వుంచిన వారి వివరాలు తమకు ఇచ్చి తీరాలని పట్టుబట్టాయి. ఒక దశలో అమెరికన్ కాంగ్రెస్, ఇందుకోసం స్విట్జర్లాండ్ మీద ఆర్థిక ఆంక్షలు విధించడానికి కూడా సిద్ధపడింది. దానితో ఉగ్రవాద సంస్థల సమాచార సేకరణకు సహకరించడానికి ఈ దేశాలు అంగీకరించక తప్పలేదు. ఆ ప్రయత్నంలోనే అమెరికన్ గూఢచారులు భారతదేశానికి సంబంధించిన నల్లధనం నిల్వలపై కూడా ఒక కన్నేశారు. పేద దేశంగా భావింపబడే భారతదేశం నుంచి ఈ విదేశీ బ్యాంకులకు తరలి వచ్చిన నల్లధనం పరిమాణం చూసి వారికి కళ్లు తిరిగాయి.

ఎంతోమంది భారతీయులు స్విట్జర్లాండ్ బ్యాంకులలో రహస్య ఖాతాలు నిర్వహిస్తున్నారన్న నిజం అందరికీ తెలుసు. అయితే వాటి విలువ ఎంత అన్నది ఎవరికీ అంచనా కూడా లేదు. అమెరికన్ల పుణ్యమా అని ఇప్పుడు దీనిపై చర్చ మొదలైంది. సుప్రీంకోర్టు కూడా ఈ అంశాన్ని పరిశీలనకు చేపట్టింది. ఈ నల్లధనం మొత్తాన్ని రప్పించగల్గితే దేశంలో పేదరికం అన్నదే లేకుండా రూపుమాపవచ్చని ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఆసక్తి చూపడం లేదు. విదేశీ బ్యాంకులలో నల్లధనం నిల్వ చేసిన వారి పేర్లు బయట పెట్టడం జరగని పని అని కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పేశాడు ప్రధానమంత్రి. ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఆయనకు వంత పాడుతున్నాడు. అందుకు వారు చెప్పే కారణం – పన్నుల ఎగవేతను నివారించడం కోసం మాత్రమే విదేశీ బ్యాంకులు తమ దగ్గరున్న భారతీయుల నిధుల వివరాలు తెలియజేస్తున్నాయని, ఆ సమాచారాన్ని వేరే ఏ ప్రయోజనం కోసం వాడినా అంతర్జాతీయ దౌత్య నియమాలను ఉల్లంఘించిన వారమౌతామని చెప్తున్నారు కేంద్ర ప్రభుత్వ పెద్దలు. అయితే వారి వాదన సహేతుకం కాదు, నల్లధనాన్ని గుట్టలు పోసుకొన్న అధికార పార్టీ రాజకీయవాదుల బండారం బయటపడి పోతుందనే భయంతోనే ఈ కుంటి సాకులు చెప్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

దేశ ఆర్థిక స్థితిగతులను సమూలంగా మార్చి వేయగల, పేదరికాన్ని పారద్రోలే మహదావకాశం కల్పించగల స్థాయిలో నల్లధనం నిల్వ వున్నమాట నిజమే అయితే, కొన్ని చిల్లర దేశాలతో దౌత్యపరమైన చిక్కులు వచ్చినా లెక్క చేయకుండా ఆ మొత్తాలని వెనక్కు రప్పించడం ప్రజా ప్రభుత్వం చేయదగిన పని. అందులో తాత్సారం ఎంత మాత్రం పనికి రాదు. దేశ హితం కంటే, దౌత్య ప్రతిష్ట గొప్పదేమీ కాదు. ఏ వికీలీక్స్ వంటి సంస్థలో నల్లధనం వీరుల జాతకాలు బయటపెట్టేవరకు ఆగకుండా ప్రభుత్వమే అందుకు నడము కట్టడం సముచితం.

జమీన్‌రైతు

జనవాణి

సరిలేని నివేదిక

శ్రీకృష్ణ కమిటీ నివేదిక ప్రజల్లో మరింత గందరగోళాన్ని పెంచేదిగా వుంది. ప్రజలు చేస్తున్న వుద్యమంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అర్థం కాక మేధావులను సమస్య పరిష్కారానికి కేంద్రప్రభుత్వం నియమించింది. మేధావులతో కూడిన ఈ కమిటీకి స్పష్టమైన తీర్పు ఇవ్వాలన్న నిబంధన విధించకపోయినా ఆ బాధ్యత ప్రస్తుత పరిస్థితుల నడుమ కమిటీపై వుందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. తెలంగాణ ఇవ్వాలా వద్దా అన్న కీలక నిర్ణయాన్ని వదిలేసి బహుళైచ్ఛిక పరిష్కారాలు సూచించి కమిటీ గజబిజి రేపింది.

బి.రాధాకృష్ణ నెల్లూరు

వ్యవసాయం చేయడం తగ్గిపోతుంది!

రాష్ట్రంలో వ్యవసాయం చేసే రైతుల సంఖ్య బాగా తగ్గిపోతుంది. వ్యవసాయ భూముల నుంచి తక్కువ ఉత్పాదకత నమోదవుతుంది. రైతులకు వ్యవసాయం గిట్టక పోవడంతో అప్పుల పాలైపోతున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల కోసం విక్రయించే ధోరణి పెరిగిపోతూవుంది. కాని రైతులను ఆదుకోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధృడమైన నిర్ణయాలేవీ తీసుకోవడం లేదు.

పి.రమణయ్య కావలి

రిజర్వేషన్లు రద్దుచేయాలి!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు రద్దు చేసి, మార్కులను బట్టి వుద్యోగాలివ్వాలి. రిజర్వేషన్ వుందని మార్కులు తక్కువైనా వుద్యోగాలు ఇవ్వడం న్యాయం కాదు. రిజర్వేషన్ వల్ల కొన్ని కులాలు బాగుపడుతున్నాయి. కొన్ని కులాలు దెబ్బతింటున్నాయి. అన్ని కులాల్లో పేదలున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్‌ను రద్దుచేసి మార్కులను బట్టి వుద్యోగాలివ్వాలి.

బి.అరుణకుమారి నెల్లూరు

అబందర తపాలాశాఖ

నేను 45 సంవత్సరాలుగా 'జమీన్‌రైతు' పత్రిక చందాదారుడను. పాత రోజుల్లో క్రమం తప్పకుండా పోస్ట్‌లో నాకు పత్రిక చేరేది. ఈ మధ్య చేరడమే లేదు. పత్రిక ఆఫీసు నుంచి నాకు పంపుతున్నట్లు సరి చూసుకొన్నాను. పోయిన వారం అంతకు ముందు రావాల్సిన నాలుగు పత్రికలు ఒకే రోజు తెచ్చి ఇచ్చారు. తపాలాశాఖ వున్నతాధికారులు సరైన చర్య తీసుకొని నాకు పత్రిక సక్రమంగా చేర్చండి.

జి.పి.చౌదరి కండ్రిగ(సంగం)

70 ఏళ్ల క్రితం ఈవారం

31-1-1941
పేజీలు : 16 వెల: అణా

పల్లెటూళ్లు
వూళ్లపాళెం పోస్టు

జవానులు ఉత్తరాలను భక్షిస్తున్నారాయేమిటి?

ఇల్లాలు

ఇల్లాలు చూచిన పుణ్యమా అన్నట్లు తండ్రి బ్రతికుండగానే ఇల్లాలిని వదలి పాలఘాటు పడతిని వివాహమాడిన తహసీలుదారయ్య ఎంత నీతిని బోధిస్తాడో?

నాయుడుపేట జులుం

సూది మందు వేయబోతే ఆ బూబమ్మ నిరాకరించడమేగాక వారితో చెప్పుకున్నందుకు హెడ్ కానిస్టేబిలెందుకు అలా ఉరకలాడె పక్కీరయ్య మీదకు?

రాజుపాళెం దుర్గంధం

పంచాయితీ ఆఫీసరుగారికి!

కాలాన లేకపోయినా కలరా రోజుల్లోని అమావాస్యనాడైనా దీపాలేవీ! చిమ్ముటలేదే! ఆ పడమర వీధిలోని మంచినీళ్ల బావి ముందు గల మురుగుడు గుంట ప్రవాహమును మాన్పించవయ్య రామ! ఆ దుర్గంధపు గుంటలో కాలుంచనిదే వూరుదాట వీలులేదే. దయచేసి అమావాస్య నాడు అయిదు గంటలకు తమరు వచ్చినా అర్ధమౌతుంది. యేమి ధర్మపాలనయ్య మీది. దేముడా! నీవైనా కళ్లు తెరవరాదా?

రేబాల పంచాయితి

వరి కోత దినాల్లో స్వీపర్లను ప్రెసిడెంట్ స్వంత కార్యానికి వినియోగించి చిమ్మడం, వెలిగించడం తుంగల్లో తొక్కవచ్చునా అని నా సందేహం.

50 ఏళ్ల క్రితం ఈవారం

27-1-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

బ్రిటిష్ రాణి భారత సందర్శనం!

బ్రిటిష్ రాణి శ్రీమతి ఎలిజబెత్, ఆమె భర్త ఎడింబరో ప్రభువు భారతదేశ సందర్శనార్థం ఈనెల 21తేది ఢిల్లీ నగరానికి స్వంత విమానం "బ్రిటానియా"లో విచ్చేశారు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ప్రధాని నెహ్రూ తదితర అధికార ప్రముఖులతోపాటు పదిలక్షల మంది ప్రజలు రాజదంపతులకు అఖండ స్వాగతమిచ్చారు. పాలం విమానాశ్రయంలో రాణి విమానం దిగటంతోనే శతఘ్నిదళం గౌరవ సూచకంగా 21శతఘ్నులు ప్రేల్చింది. రాణికీ, ఆమె భర్తకు ప్రథమంగా స్వాగత మొసగే అవకాశం రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌కు లభించింది. పిమ్మట వారిని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు, ప్రధాని నెహ్రూకు, కామన్వెల్తు హైకమిషనర్లకు, కేంద్రమంత్రులు, ఢిల్లీ మేయరు ప్రభృతులకు రాష్ట్రపతి పరిచయం చేశారు. సైనిక వందనం తర్వాత రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ రాణి ఎలిజబెత్‌కు సాదరమైన స్వాగతం జెప్పారు. బ్రిటన్‌తో యిండియా చిరకాల సాహచర్యం గూర్చి ఉద్ఘాటిస్తూ, రాణిరాక భారతప్రజలకు వసంతఋతు ఆగమ సూచక మన్నారు రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్. స్వాగతానికి కృతజ్ఞత తెలుపుతూ, భారతదేశంలోని సర్వజనులకు బ్రిటిష్ ప్రజల సద్భావ అనురాగాలను అందజేస్తున్నానని, తమరాక ఉభయదేశాల మధ్య గల పరస్పర గౌరవ స్నేహ భావాలను ప్రపంచానికి చాటగలదని తానాశిస్తున్నట్లుగా చెప్పారు ఎలిజబెత్ రాణి.

శివారెడ్డి పద్యాలు
ఎలిజబెత్ రాణి

ఎలిజబెత్తు రాణి యింగ్లాండు దొరసాని
భర్తతోడగలసి బయలుదేరి
వస్తే యిండియాకు వల్లంత బంగారె!
వద్దు మనకు బాబు ఎద్దుబరువు!

నెల్లూరు ముచ్చట్లు

నెల్లూరు పోలీసులకు ఇండియన్ పోలీస్ మెడల్స్

విశిష్ట సేవలకుగాను జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న ఇద్దరు పోలీస్ అధికారులకు ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్స్ దక్కాయి. వీరిద్దరు పోలీసుశాఖలో క్రిందిస్థాయి నుంచి పైస్థాయికి ఎదిగినవారు కావడం విశేషం. నెల్లూరు రూరల్ ఎస్ఐగా ఇటీవల నియమితుడైన ఆళహరి వెంకట్రావు, ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ పోతురాజు రామచంద్రయ్యలు ఇండియన్ పోలీస్‌మెడల్‌కు ఎంపికయ్యారు. వెంకట్రావ్ 1973లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా వుద్యోగంలో చేరి క్లూస్‌టీంలో పనిచేసే సమయంలో క్లిష్టమైన కేసులు పరిష్కరించి పేరుగాంచారు. 1972 ఏ.ఆర్ కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో ప్రవేశించిన రామచంద్రయ్య సివిల్, ఇంటలిజెన్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్‌గా ప్రతిభావంతంగా పనిచేసి 50కుపైగా ప్రశంసాపత్రాలు పొంది ఎఎస్ఐగా ప్రమోషన్ పొందారు. మరో నాలుగు నెలలు మాత్రమే సర్వీసు వున్న రామచంద్రయ్య తనకు ఇండియన్ పోలీస్ మెడల్ రావడం పట్ల చెప్పలేనంత సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నెల్లూరులో నారాయణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు 25వతేది నెల్లూరు వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఆ పార్టీలో కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. సహజంగా అధికారంలో వుండే పార్టీకి ప్రతిపక్షం వుండడం ఆనవాయితీ. దీనికి భిన్నంగా ఆ పార్టీ వారే ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీలో సమర్ధుడైన నాయకుడే లేడు. రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి నెలకొనడం వల్ల ప్రజాసమస్యలు పరిష్కారం కావడం లేదని నారాయణ విమర్శించారు.

పెద్దమొత్తంలో గంజాయి స్వాధీనం

విచిత్రంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు చేసిన దాడుల్లో 44 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమయ్యింది. సున్నపు బట్టిలోని టోల్‌ప్లాజా వద్ద 25వతేది అర్ధరాత్రి వాహనాల తనిఖీ చేస్తున్న ప్రొహిబిషన్ శాఖాధికారులకు విజయవాడ నుండి గంజాయిని చెన్నైకు ఆర్టీసి బస్సులో తరలిస్తూ శాంతి, రామా మృతం అనే మహిళలు పట్టుబడ్డారు.

తప్పు చేయడం లేదు!

ప్రజల సంక్షేమం, అభివృద్ధికోసం అధికార పార్టీతో కలసి తిరగడం తప్పు కాదని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. 25వతేది నెల్లూరులోని ప్రజారాజ్యం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌తో కలసి పోయిందని మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం కుప్పకూలి మళ్లీ ఎన్నికలు వస్తే ప్రభుత్వం నష్టపోకూడదని చిరంజీవి ప్రభుత్వానికి మద్దతు ఇస్తానని ప్రకటించారని చెప్పుకొచ్చారు.

భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీతో ప్రజారాజ్యం పార్టీకి ఎన్నికల పొత్తు కుదరని పక్షంలో రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మీద పోటీ చేయడానికి కూడా తాను సిద్ధమేనన్నారు. మొత్తం మీద శ్రీధర్‌కృష్ణారెడ్డికి పెద్ద ధైర్యమొచ్చిందే!

మార్కెట్‌లో మరోసారి తనిఖీ

నెల్లూరు ఎసి కూరగాయల మార్కెట్‌ను 25వతేది జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జ్వాలా ప్రకాష్ మరోసారి తనిఖీ చేశారు. తప్పుడు తూకాలను తూయవద్దని, మార్కెట్‌ను శుభ్రంగా వుంచుకోమని సలహా ఇచ్చి వచ్చారు. వున్నతాధికారి రాక ముందే వ్యాపారులకు తెలియడం వల్ల వారు తమ దుకాణాల్లో తప్పుడు తూకాలు తెలియకుండా జాగ్రత్త పడ్డారు.

మునిసిపల్ మంత్రికి కోపమొచ్చింది!

కావలిలో కాపురముండే రాష్ట్ర మునిసిపల్ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డికి స్థానికంగా పనిచేసే మునిసిల్ అధికారులపై కోపమొచ్చినట్లుంది. దీంతో ఐదుగురు బిల్ కలెక్టర్లు, ఒక ఆర్ఐపై ఆయన సస్పెన్షన్ వేటు వేశారు. 25తేది మునిసిపల్ ఆఫీసులో అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన మంత్రి కావలిలో నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న అపార్ట్‌మెంట్లు, వేసిన అక్రమ కొళాయి పై మండిపడ్డారు. మునిసిపల్ మంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించినాక కావలి అభివృద్ధికి మంజూరు చేసిన కోటిన్నర రూపాయలతో త్వరితగతిన మురికి కాలువలు, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కావలి మునిసిపాలిటి అభివృద్ధి పరంగా అట్టడుగు స్థానంలో వుంది. దీని అభివృద్ధి కోసమే మహీధర్‌రెడ్డి మునిసిపల్ మంత్రి అయినట్లుందని చెప్పకతప్పదు.

మునిసిపల్ మంత్రిని సన్మానించిన పార్వతమ్మ

కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ రాష్ట్ర మునిసిపల్ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిని 25వతేది ముసునూరులోని తన నివాసానికి పిలిపించి కేక్ కట్ చేయించారు. ఆత్మీయుల సమక్షంలో మంత్రిని సన్మానించారు. కావలి మాజీ మునిసిపల్ ఛైర్మన్ గ్రంధి యానాది శెట్టి, ఆర్డీవో ఎం. వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డి.వి.కృష్ణారెడ్డి, ఎమ్వీ రామిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నెల్లూరులో లయన్స్ గవర్నర్

లయన్ జిల్లా గవర్నర్ అంకినీడు ప్రసాద్‌బాబు 23తేది నెల్లూరులో పర్యటించారు. గవర్నర్ పర్యటనను పురస్కరించుకొని నెల్లూరు లయన్స్‌క్లబ్, సేవాప్రియ, లేడీస్ లగ్జరీక్లబ్‌లు సంయుక్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి.

జెసికి సంయుక్త కార్యదర్శి హోదా!


నెల్లూరు జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్‌కు సంయుక్త కార్యదర్శి హోదా కల్పిస్తూ ప్రభుత్వం వుత్తర్వులు జారీ చేసింది. 2002వ సంత్సరంలో కడప అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన సౌరభ్‌గౌర్ ఎపి ట్రాన్స్‌కోలో ఓఎస్‌డిగా పనిచేస్తూ నెల్లూరుకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చారు.

పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్

నెల్లూరులోని ఎకెనగర్ పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను 20తేది ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజనల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.సంపత్, పోస్టల్ సర్వీసు డైరెక్టర్ డివిఎస్ ఆర్ మూర్తి, సూపరింటెండెంట్ ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం

జిల్లాలో రైతాంగానికి నీరివ్వకుండా వేలాది ఎకరాలను అధికారులు ఎండబెడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. నీటిపారుదల, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సోమశిలలో



70టిఎంసిలు నీరు నిల్వవున్నా కనుపూరు, కావలి కాలువల క్రింద మొదటి పంటకు నీరివ్వనందున 16వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు.

సెయింట్ పీటర్స్ స్కూల్ వజ్రోత్సవాలు

సంతపేటలో గల సెయింట్‌పీటర్స్ స్కూలు 75 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పితాని సత్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పాల్గొన్నారు. ఆనం రామనారాయణరెడ్డి, వివేకా తామీ పాఠశాలలో చదివిన సంగతిని గుర్తు చేసుకొన్నారు.







హడలెత్తిస్తున్న దొంగతనాలు!

బంగారు వ్యాపారస్తులే టార్గెట్



గాయపడ్డ బంగారు వ్యాపారి సతీష్ జైన్.

నెల్లూరు నగరంలోని బంగారు వర్తకులను దొంగల భయం వెన్నాడుతోంది. పెద్ద మొత్తంలో వ్యాపార లావాదేవీలు చేస్తూ దూర ప్రయాణాలు సాగించే వ్యాపారులు ఇటీవల కాలంలో చోటు చేసుకొంటున్న సంఘటనలతో హడలిపోతున్నారు. తాజాగా రైల్వే స్టేషన్ వద్ద గల ఇంటికి వెళ్తున్న బంగారు వ్యాపారిపై దాడి చేసి 75 లక్షలు అపహరించడం సంచలనం కల్గించింది. బంగారు వ్యాపారులపై దొంగల దాడి, నగల అపహరణ, దొంగతనాలకు సంబంధించి పోలీసులు తగిన సూచనలు, జాగ్రత్తలు చెప్తున్నా అలసత్వం వహించడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నది వాస్తవం. తరచూ దొంగల బారిన బంగారు వ్యాపారులు పడుతుండడంతో డిసెంబర్ నెలలో రంగనాయకుల పేటలోని బులియన్ మర్చంట్స్ కళ్యాణ మండపంలో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. డిఎస్పీ రాధిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దూర ప్రాంతాలకు ఆభరణాలు తీసుక వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షాపుల్లో నమ్మకస్తులను పెట్టుకోవడం, కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, పగటి పూటే ప్రయాణాలు చేయడం లాంటి జాగ్రత్తలు చెప్పినప్పటికీ వ్యాపారస్తులు వాటిని పాటించక పోవడంతో దొంగతనాలు, దోపిడీలు అధికం అయ్యాయి. ఇందులో మరో అంశం ఇమిడి వుంది. బంగారు, వజ్రాభరణాల లావాదేవీలను ప్రభుత్వానికి తెలియకుండా, లెక్కల్లో చూపకుండా చాటుమాటుగా చేస్తుండడమే కారణంగా తెలుస్తోంది. మొత్తం మీద పెద్ద ఎత్తున జరుగుతున్న దోపిడీ, దొంగతనాలు బంగారు వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

కలప వ్యాపారుల అక్రమ వ్యాపారం!

విదేశాల నుంచి దిగుమతి చేసుకొంటూ పన్ను ఎగ్గొడుతున్నారు.

నగరంలో గల టింబర్ డిపోల నిర్వాహకులు కొందరు అక్రమంగా కలప వ్యాపారం సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల్లో గండికొడుతున్నారు. వ్యాపారులు ఎవరైనా కలప అమ్ముకోవడానికి ఎగుమతి, దిగుమతులకు ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా పొందివుండాలి. పర్మిషన్ పొందిన తర్వాత దానిని క్రమం తప్పకుండా రెన్యువల్ చేయించుకోవాలి. అయ్యప్పగుడి ప్రాంతంలో ఈ వ్యాపారం చేసేవారు పలువురు టింబర్ డిపోలను నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమంగా కలప అమ్మకాలు సాగిస్తుండడం విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. ఉడ్ కాంప్లెక్స్‌లో గల టేకు వ్యాపారం చేసేవారు మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, నైజీరియా, ఘనా దేశాల నుంచి టేకు దుంగలను దిగుమతి చేసుకొంటుంటారు. ఆయా దేశాల్లో తక్కువ ధరకు కలప లభ్యం కావడమే ఇందుకు కారణం. ఆ కలపను అమ్మడానికి ప్రభుత్వ అనుమతి లేకుండానే పలువురు వ్యాపారులు చేయడంతోపాటు, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎగ్గొట్టడం, తక్కువ చూపడం లాంటి ఎన్నో అక్రమాలు విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డాయి. సాధారణంగా టింబర్ డిపోల తనిఖీ, అక్రమ నిల్వలు తదితరాలను తనిఖీ చేయాల్సిన బాధ్యత ఫారెస్ట్ అధికారులపై వుంటుంది. వ్యాపారులతో కొందరు అధికారులు, సిబ్బందికి లాలూచీ వుండడంతో వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతోంది. నెల్లూరు కేంద్రంగా కోట్ల రూపాయల మేర అక్రమ కలప వ్యాపారం జరుగుతుందనడం నిజం.

గ్యాస్ సరఫరా మెరుగుపడలేదు!

అల్లాడుతున్న జనం



గ్యాస్ సిలిండర్ల సరఫరా, అక్రమ వినియోగంపై పౌరసరఫరాల శాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శల పాలౌతోంది. గృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను అక్రమంగా వ్యాపార అవసరాలకు యదేచ్ఛగా వినియోగిస్తున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడో నిద్రమత్తు వదిలించుకొన్నట్లు తూతూమంత్రంగా రోడ్డు ప్రక్కన బండ్లపై వ్యాపారం సాగించేవారు, చిన్న చిన్న టిఫిన్ అంగళ్లపై దాడులు చేసి గృహ అవసరాలకు వాడే సిలిండర్లను స్వాధీనం చేసుకొని తమ పనైపోయిందని భావించడం తప్ప పెద్ద పెద్ద హోటళ్లు, ఇతరత్రా వ్యాపార సంస్థలపై దాడులు చేసి అక్రమ సిలిండర్లను స్వాధీనం చేసుకొన్న దాఖలాలులేవు. ఇక కొందరు ఈ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను వేరే సిలిండర్లలోకి నింపి పెద్ద ఎత్తున అమ్మకాలు సాగిస్తున్నా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. స్టోన్‌హౌస్‌పేట, సంతపేట తదితర ప్రాంతాలలో ఈ వ్యాపారం పెద్ద ఎత్తున గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. దీనికి తోడు గ్యాస్ వినియోగదారులకు సిలిండర్ల సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా గ్యాస్ ఏజన్సీల నిర్వాహకుల్లో మార్పు రావడం లేదు. లారీల్లో లోడును రాత్రి వేళల్లో తాము ఎంచుకొన్న ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి సిలిండర్లను బ్లాక్‌లో విక్రయించేందుకు అన్నీ ఏర్పాట్లు చేసుకొని అక్రమ వ్యాపారం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో గృహవినియోగదారులకు సిలిండర్లు సక్రమంగా అందకపోగా, బ్లాక్‌లో మాత్రం క్షణాల్లో సిలిండర్లు దొరుకుతుండడం విశేషం.

● ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో

హనుమంతరావు ముందంజ

మూడు జిల్లాలలో ప్రచారం



శాసన మండలి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీనియర్ న్యాయవాది దేశాయిశెట్టి హనుమంతరావు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ముమ్మరంగా ప్రచారం చేసిన ఆయన తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన తాను రెండవ స్థానంలో నిలచానని, తిరిగి తనపై నమ్మకంతో రాష్ట్ర పార్టీ చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందన్నారు. 1982 నుంచి నెల్లూరు జిల్లాలో న్యాయవాదిగా పని చేస్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో జిల్లా న్యాయవాది విభాగం అధ్యక్షునిగా రెండుసార్లు పని చేశానని, పార్టీలో పలు పదవులు నిర్వహించానని, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా పని చేసి న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి విశేషకృషి చేసినట్లు వివరించారు. జరుగబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. పై మూడు జిల్లాలలో విస్తృత సంబంధాలు కల్గిన హనుమంతరావు ప్రచారంలోనూ అందరిని కలుపుకొని గెలుపు కోసం విశేష కృషి చేస్తున్నాడు.

చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు మహదేవనాయుడు సైతం హనుమంతరావును గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ గట్టిగా కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను కోరారు.

నాసిరకంగా డ్రైన్ పనులు

ఫత్తేఖాన్‌పేట ప్రజలు గోడు పట్టదా?



నెల్లూరు నగరంలోని నడిబొడ్డు ప్రాంతమైన ఫత్తేఖాన్‌పేటలోని రైతుబజారు సెంటర్ నుంచి రాగిచెట్టు సెంటర్ వరకు నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఈ పని చేపట్టను 10లక్షల రూపాయల నిధులు విడుదల చేశారు. ఈ పనులు పొందిన స్థానిక నాయకుడు గుంటలు త్రవ్విన దగ్గర నుంచి పనికి వాడుతున్న కంకర, ఇసుక, సిమెంటు కలపోత మరీ నాసిరకంగా వుంది. మరీ బూడిద సిమెంట్‌తో ఈ పనులు చేపడుతున్నారని ప్రజలు స్వయంగా కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువయ్యింది. ఈ పది లక్షల నిధులు స్థానిక నాయకుడిని సంతృప్తిపర్చను విడుదలయ్యాయా అనే సందేహం కల్గుతోంది. మరీ ఇంత నాసిరకంగా డ్రైన్ పనులు చేపడితే ఎలా?

ఆనవాలు కోల్పోతున్న అమెరికనాస్పత్రి!

అపర సంజీవనీ వృక్షం వంటి సంస్థ రియల్‌ఎస్టేట్ దాష్టీకానికి బలైపోతుంటే అదేమని అడిగే వారే నెల్లూరులో లేరేమి?

అమెరికన్ ఆస్పత్రి ఆనవాలు అంతరించిపోతున్నది. నూట పదేళ్ల కుపైగా నెల్లూరు ప్రజానీకానికి అమూల్యమైన వైద్య సేవలందించిన అమృత ప్రాయమైన సంస్థ అదృశ్యమై పోతున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల దాష్టీకానికి బలై నిశ్శబ్దంగా అంతరించిపోతున్నది. ఆస్పత్రి తూర్పు భాగంలోని బేరమ్మ బంగళాతో సహా కట్టడాలన్నిటినీ రాత్రి రాత్రి కూలగొట్టేశారు. మహా వట వృక్షాల వలె పెరిగి, రోగులకు చల్లటి నీడ ఇచ్చిన వందేళ్ల వయస్సున్న చెట్లను కూకటి వేళ్లతో పెకిలించి పారేశారు. అమెరికన్ ఆస్పత్రి చరిత్ర తెలిసినవారికి, ఆ వైద్య సంస్థ నెల్లూరు జిల్లా ప్రజానీకానికి అందించిన అద్భుత సేవలు చూసిన వారికి కళ్లు చెమ్మగిల్లి చేసే పరిణామం ఇది.



అమెరికన్ ఆస్పత్రి ముఖద్వారం.

1890 ప్రాంతంలో పురుడు పోసుకొన్నది ఈ ఆస్పత్రి. అమెరికా నుంచి వలస వచ్చిన డాక్టర్ ఫయే లెవెరింగ్, శ్రీమతి జార్జి బ్రూక్ అనే ఇద్దరు క్రైస్తవ మత ప్రచారకులు ప్రస్తుతం ఎబిఎం బాలికల పాఠశాల వున్న చోటుకు ఎదురుగా ఒక బాడుగ ఇంట్లో వైద్య సేవలు ప్రారంభించారు. నిరుపేద ప్రజలు వైద్య సహాయం లేక ఎదుర్కొంటున్న సమస్యలు చూసి చలించిపోయి తమకు తోచిన సాయం చేయడం మొదలు పెట్టారు. త్వరలోనే దానికి బాప్టిస్ట్ మిషన్ తోడ్పాటు లభించింది. అమెరికన్ ఆస్పత్రి నిర్మాణానికి సహకారం అందించింది. మొదట మొదట మహిళలు, చిన్న పిల్లలకు మాత్రమే చికిత్స చేసేవారు. ఒక నర్సింగ్ శిక్షణా కేంద్రం కూడా ప్రారంభించారు. 1927లో ఆస్పత్రిని సమగ్రంగా విస్తరించారు. అప్పటి నుంచి 1999 వరకు కొన్ని వేల మందికి ఇక్కడ స్వస్థత లభించింది. ఆస్పత్రి తరపున ఉదయగిరి వంటి దూర ప్రాంతాలకు కూడా వెళ్లి వైద్య సేవా శిబిరాలు నిర్వహించే వారు.

బేరమ్మ వచ్చిన తర్వాత ఆస్పత్రి బహుముఖాలుగా విస్తరించింది. నెల్లూరుజిల్లా ప్రజలకు ఆమె చేసిన వైద్య సేవ నిరుపమానమైనది. అమెరికా నుంచి వలస వచ్చి, రోగుల సేవలోనే జీవన సాఫల్యం వుందన్న నమ్మకంతో నెల్లూరుజిల్లా ప్రజలతో మమేకమైనారామె.

ఆర్ఎల్.రెడ్డి సత్రాన్నైనా రక్షించండి

అమెరికన్ ఆస్పత్రి అనుబంధంగా ఆర్ఎల్.రెడ్డి సత్రం వుంది. ఆస్పత్రిలో పురుడు పోసుకోవడానికి వచ్చే గర్భిణీ స్త్రీలు విశ్రాంతి తీసుకోవడానికి ఈ సత్రం కట్టించాడు ఆర్ఎల్.రెడ్డి. అయితే ఇది అమెరికన్ ఆస్పత్రి ఆస్తులలో భాగం కాదు. అందువల్ల దానిపై వారెవరికీ ఎటువంటి హక్కూ లేదు. ఇప్పుడు ఆస్పత్రే అదృశ్యమైపోయింది కాబట్టి, సత్రం కూడా అనవసరం. ఆర్ఎల్.రెడ్డి వారసులెవరైనా చొరవ చూపి, ఆ సత్రం స్థలాన్ని స్వాధీనం చేసుకొని, మరేదైనా ప్రజోపయోగకర కార్యానికి వినియోగించవచ్చు. అలసత్వం వహిస్తే, ఎవరో ఒకరు దాన్నీ అమ్మి పారేస్తారు.

ఆస్తి ఎవరిది? అమ్మిందెవరు?

అమెరికన్ ఆస్పత్రి అమ్మకంపై అభ్యంతరం చెప్పడానికి ముందు అసలా ఆస్తి ఎవరిది అన్న విషయం తెలుసుకోవడం అవసరం. అమెరికన్ ఆస్పత్రిని 1893లో, నూటపది హేడు సంవత్సరాల క్రితం నెలకొల్పారు దీన్ని. అమెరికాకు చెందిన బాప్టిస్ట్ మిషనరి యూనియన్ అనే సంస్థ దీని స్థాపకురాలు. ప్రపంచ వ్యాప్తంగా క్రిస్టియన్ మతాన్ని అభివృద్ధి పరచడం, అందుకోసం వివిధ దేశాలలో ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం దీని కార్యకలాపం. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలన్నిటిలో ఈ సంస్థ లెక్కలేనన్ని ధార్మిక సంస్థలు నెలకొల్పింది. బ్రిటిష్ ప్రభుత్వం వారికి అడిగిన చోటల్లా ఉదారంగా భూములు బహుకరించినది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి తను స్థాపించే సంస్థల వ్యవహారాలు పర్యవేక్షించడానికి తెలుగు బాప్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థను, 1893లో నెల్లూరులో ప్రారంభించారు. ఆ తరువాత దాని పేరు తెలుగు బాప్టిస్ట్ కన్‌వెన్షన్ అని మార్చారు. 1961లో మరొకసారి పేరు మార్చి, సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చస్ అని నామకరణం చేశారు. అదే సమయంలో అమెరికన్ బాప్టిస్ట్ యూనియన్ పేరు కూడా, అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ అని మార్చారు. ఈ సంస్థ మన రాష్ట్రంలోని వివిధ చోట్ల లెక్కలేనన్ని సంస్థలు స్థాపించింది. చర్చిలు, ఆస్పత్రులు, పాఠశాలలు, నర్సింగ్ కాలేజిలు, బోర్డింగ్ హోమ్స్, హాస్టల్స్, అనాథ శరణాలయాలు వంటి వెన్నో వీరి పుణ్యాన పురుడు పోసుకున్నాయి. వాటిలో అమెరికన్ ఆస్పత్రి కూడా ఒక్కటి.

విలువ ఇరవైకోట్లు కొన్నది రెండుకోట్లకు!


ఆస్పత్రిలోని భవనాలను ధ్వంసం చేసి లేఅవుట్ వేసేందుకు పనులు చేస్తున్న దృశ్యం.

1941లో ఏ కారణం చేతనో,సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ అసోసియేషన్ పరిధిని మన రాష్ట్రం నుంచి మొత్తం దేశానికి విస్తరించారు. ఇందు

కొరవ 14వ పేజీలో

సేవా భావం అనే పునాదుల మీద త్యాగమనే భవనాలు కట్టి, పేద ప్రజల పాలిట సంజీవనీ వృక్షం వలె పేరు పొందిన అమెరికన్ ఆస్పత్రి మూత

కొరవ 14వ పేజీలో






ఇందుకూరుపేటలో దీపం పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ.



రచ్చబండ కార్యక్రమంలో భాగంగా జల్ తుఫాన్ బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి.



బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న అను అక్వా డైరక్టర్ బొడ్డు మురళీమోహన్‌రెడ్డి.



నెల్లూరు చంద్రారెడ్డి డిగ్రీ కాలేజీలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడుతున్న కరస్పాండెంట్ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి.

కలువాయి పిహెచ్‌సి తనిఖీ చేసిన కురుగొండ్ల!



కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి రోగులను విచారిస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.

కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. ఆరోగ్య కేంద్రం పనితీరుపై పలు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీచేశారు. ఆస్పత్రిని పరిశీలించడం తోపాటు మందులు సరఫరా, వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ తనిఖీ చేసే సమయానికి ఆరోగ్య కేంద్రం వైద్యుడు సందాని బాషా అదనపు బాధ్యత లంటూ చేజర్ల పిహెచ్‌సికి వెళ్లడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రెండో డాక్టర్ అవసరం ఎంతో వున్న ఆరోగ్య కేంద్రంలో వున్న డాక్టర్ కూడా అదనపు బాధ్యతలంటూ వెళ్లడాన్ని ఆయన తప్పుబట్టారు. డిఎంహెచ్‌ఓతో మాట్లాడి ఈ కేంద్రానికి రెండో డాక్టర్‌ని నియమించేలా చూడడంతోపాటు వున్న డాక్టర్ సక్రమంగా విధులు నిర్వహించేలా, రోగులకు వైద్యసేవలు సరిగా అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. శవాలను భద్రపరచేందుకు తన సొంత ట్రస్టు నుంచి ఫ్రీజర్ బాక్స్‌లను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రసూల్ ఖాన్ అభ్యర్థన మేరకు మరణించిన వారికి కలువాయి పిహెచ్‌సిలోనే శవ పరీక్షలు జరిపేలా అధికారులతో మాట్లాడుతామన్నారు. అనంతరం కాకివాయి నుంచి కలువాయి వరకు జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించిన ఆయన నాసిరకంగా పనులు చేపట్టడంపై అధికారులపై మండిపడ్డారు. నాణ్యతగా రోడ్డు పనులు జరిగేలా చూడాలన్నారు. ఎంపిడిఓ యునైసీ, తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయశాఖ ఎడి రత్నప్రసాద్, టిడిపి నాయకులు వేణు గోపాలరెడ్డి, రమణయ్యనాయుడు, పెంచలయ్య, నాగరాజు, లీలామోహన్‌రెడ్డి, శివరామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

భూ పంపిణీపై అయోమయం

ఆత్మకూరులో పరిస్థితిది

ఆత్మకూరు నియోజకవర్గంలో భూపంపిణీపై అయోమయం నెలకొనింది. ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో పేదలకు భూపంపిణీ జరపడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం పట్ల లబ్దిదారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. జిల్లాలోని వివిధ నియోజక వర్గాల్లో ఐదవ విడత భూపంపిణీ నిర్వహిస్తుండగా ఆత్మకూరులో మాత్రం పరిస్థితి భిన్నంగా వుండడం విశేషం. మంత్రి చేతుల మీదుగా భూపంపిణీ జరిపించాలని అధికారయంత్రాంగం సర్వసన్నాహాలు చేస్తుండగా మంత్రికి మాత్రం ఇంకా తీరుబడి అయినట్లు లేదు. దీంతో ఈ కార్యక్రమం ఇదిగో అదిగో అంటూ వాయిదా పడుతూనే వుంది. ఏడాది క్రితం అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా ఆర్భాటంగా దీనిని ప్రారంభించారు తప్ప పంపిణీ చేపట్టలేదు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ఎప్పుడు భూపంపిణీ చేపట్టాలన్నా ఏదో ఒక అవాంతరాలు ఎదురౌతూనే వున్నాయి. గతంలో రెండవ విడత భూపంపిణీలో ఆనాడు ఎమ్మెల్యేగా కొమ్మి లక్ష్మయ్యానాయుడు వున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు కొందరు ఆయన్ను వ్యతిరేకించడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఫలితంగా రెండవ విడత భూపంపిణీ ఆత్మకూరులో నిర్వహించలేకపోయారు.

కళాసంస్థ పేరిట వసూళ్లు!

● ఆత్మకూరులో సిపిఎం మాజీ నేత దందా

నిన్న మొన్నటి వరకు సిపిఎం పార్టీలో కొనసాగి ఆ తర్వాత పార్టీ నుంచి గెంటివేయబడ్డ వ్యక్తి కళా సంస్థ పేరిట దండకాలకు దిగడం ఆత్మకూరు పట్టణంలో చర్చనీయాంశ మయ్యింది. షేక్ షుకూర్ అనే వ్యక్తి సిపిఎం పార్టీలో వుండేవారు. వివిధ కారణాలతో పార్టీ నుంచి ఆయన్ను బయటకు పంపారు. ఈ మాజీ మార్క్సిస్ట్ తర్వాత కాలంలో శ్రీశ్రీ సాహితి కళావేదిక పేరిట ఒక సంస్థను స్థాపించి ఆ కార్యక్రమాల కోసం అని దండకాలు సాగిస్తుండడంతో పలువురు వ్యాపారులు, రాజకీయ నేతలు అతను అడిగింది ఇచ్చి గమ్మునుంటున్నారు. పార్టీలో లేకపోయినా మార్క్సిస్ట్ ముసుగులో బలవంతంగా వసూళ్లకు, చందాల దండకాలకు పాల్పడుతుండడం అధికం కావడంతో చివరకు సిపిఎం నేతలు ఆ వ్యక్తితో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదంటూ ప్రకటించాల్సి వచ్చింది. కళాసంస్థను అడ్డం పెట్టుకొని దండకాలకు పాల్పడడం పట్ల సిపిఎం డివిజన్ కార్యదర్శి గంటా లక్ష్మీపతి, పట్టణ కార్యదర్శి నాగయ్య, సందాని, పుల్లయ్య తదితరులు తీవ్ర విమర్శలు చేశారు.

స్మశాన స్థలం కబ్జా

కావలి పట్టణంలో గల పాతూరు స్మశాన స్థలం రోజురోజుకు ఆక్రమణ చెరచిక్కి కుచించుకపోతోంది. కబ్జా ఫలితంగా చివరకు శవాలకు అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. మొదట్లో ఊరికి దూరంగా వుండే పాతూరులో సర్వే నెంబర్ 510లో 8.5 ఎకరాల స్థలం స్మశానంగా వుండేది. పట్టణం విస్తరించిన నేపథ్యంలో 1985లో ఆ స్థలంలో 4 ఎకరాలను గిరిజనులకు ఇళ్ల స్థలాలుగా కేటాయించారు. మిగిలిన స్థలం స్మశానంగా వినియోగిస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కన్ను స్మశాన స్థలంపై పడింది. కొద్దికొద్దిగా ఈ స్థలాన్ని ఆక్రమించుకొంటుండడంతో చివరకు శవాలకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు, పూడ్చేందుకు వీలు లేకుండా పోయింది. ఆక్రమించిన స్థలంలో ఏకంగా ఇళ్లను నిర్మించి వేశారు. విద్యుత్ కనెక్షన్, కొళాయి కనెక్షన్‌లు తెచ్చేసుకొన్నారు ఆక్రమణదారులు. ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నెల్లూరు టిబి హాస్పిటల్ ప్రాంగణంలో జీవనోపాధి వనరుల కేంద్ర భవనానికి శంకుస్థాపన చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ.

రెవిన్యూ సిబ్బందిపై జెసి ఆగ్రహం

కలిగిరి మండలం కొండాపురం రెవిన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సొరబ్ గౌర్ తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన తప్పుల తడకగా వుండడంతో ఎమ్మార్వో జయప్రకాష్‌పై మండిపడ్డారు. పలు అంశాలపై ప్రశ్నించిన జెసికి సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిని మందలించిన ఆయన ప్రజా సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన పని తీరు మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు!

ముత్తుకూరు మండలంలో ప్రయాణీకుల సౌకర్యం కోసం నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. లక్షలు వ్యయం చేసి నిర్మించిన ఈ షెల్టర్ల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఏర్పాటైన కొద్దికాలానికే రూపురేఖలు కోల్పోయాయి. కూర్చొనేందుకు ఏర్పాటుచేసిన నాపరాళ్లు పగిలిపోయి అధ్వాన్నంగా తయారయ్యాయి. ఎండా వానల నుంచి ప్రయాణీకులు రక్షణ పొందేందుకు బస్సు షెల్టర్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ ఎవరికి పట్టకపోవడం వీటిపాలిట శాపమైంది. కుమ్మరమిట్ట, పాటూరివారి కండ్రిగ, గురవయ్యశాల గ్రామాల్లో గల బస్ షెల్టర్లను పరిశీలిస్తే ఎంతగా నిరుపయోగమైంది తెలుస్తుంది.

రేషన్ షాపు ఏర్పాటుకు విజ్ఞప్తి!

దగదర్తి మండలం అనంతవరం పంచాయితి పరిధిలో గల లయన్స్‌నగర్‌లో చౌకదుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకొంటున్నారు. ప్రస్తుతం అనంతవరంలో రేషన్‌షాపు ఉంది. అక్కడకు వెళ్లాలంటే రెండు కిలో మీటర్లు పోవాల్సి వస్తోందని, అంత దూరం పోయి సరుకులు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా వుందని వారు వాపోతున్నారు. కూలీనాలీ చేసుకొనే తాము రేషన్ షాపుకు వెళ్లిరావాలంటే పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో వుంచుకొని తమ ప్రాంతంలో రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావుకు వినతి పత్రం అందించారు. దీనిపై ఆర్‌డిఓతో మాట్లాడుతామని ఎమ్మెల్యే తెలిపారు.

టైర్ల దొంగతనాలు

కావలి డివిజన్ పరిధిలో టైర్ల దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. హైవేపై లారీలను ఆపి వాహన సిబ్బంది విశ్రాంతి తీసుకొనే సమయాల్లో, రాత్రివేళల్లో లారీ టైర్లను తస్కరించే ముఠా పెద్దఎత్తున సంచరిస్తుండడంతో ఇటీవల కాలంలో ఈ దొంగతనాలు అధికం అయ్యాయి. హెవీలోడ్ వాహనాల టైర్లు ఖరీదు కావడంతో దొంగల ముఠా చాకచక్యంగా నిలిపి వున్న వాహనానికి టైర్లు విప్పేసి గుట్టుచప్పుడు కాకుండా తరలించుక పోతుండడంతో వాహనాల యజమానులు లబోదిబోమంటూ పోలీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. హైవే పెట్రోలింగ్ చేసే పోలీసులు విధులు నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నందునే ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మామను తెగడిన అల్లుడు



● ప్రసన్నకు ప్రజలే బుద్ధి చెబుతారన్న సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల కృషితో గెలిచి ఆ పార్టీకే నమ్మక ద్రోహం చేసిన కోవూరు శాసన సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కోవూరులో పర్యటించిన ఆయన ప్రసన్న తీరుపై నిప్పులు చెరిగారు. తెలుగుదేశం గుర్తుపై గెలిచిన ప్రసన్న ధనదాహంతో నియోజకవర్గ ప్రజలను మోసం చేసి, వారికి నమ్మకద్రోహం చేసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెంట నడిచాడని, నేడు ఆయన కుమారుడు జగన్‌కు జిందాబాద్ కొడుతున్నాడని విమర్శించారు. అలాంటి వ్యక్తికి నియోజకవర్గంలోని ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. అలాంటి ప్రసన్నకు తెలుగుదేశం పార్టీని విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల కారణంగా మధ్యంతర ఎన్నికలు రావడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో తెలుగుదేశం పార్టీ 10 అసెంబ్లీస్థానాలను కైవసం చేసుకొంటుదన్న ధీమాను వ్యక్తం చేశారు. సోమిరెడ్డి వెంట తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర, రాష్ట్ర కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్పీటిసి సభ్యుడు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ సిఎం కావడం తథ్యం!

జలదంకిలో జోస్యం చెప్పిన రాజమోహన్‌రెడ్డి

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్ జగన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం తథ్యం అని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. జలదంకి మండలం చామదలలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జగన్‌ను సిఎం చేయాలన్న తపన రాష్ట్ర ప్రజలలో బలంగా నాటుకొనిపోయి వుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మరణం తర్వాత రాష్ట్రంలో పాలన కుంటుపడిందని, ఆయన లేని లోటు స్పష్టంగా కన్పిస్తున్నదన్నారు. ఎన్నో జనరంజక మైన, ప్రజోపయోగ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ దేనని అన్నారు. అలాంటి పాలనను అందించే వ్యక్తి జగన్ మాత్రమేనని అందుకే ప్రజలందరూ జగన్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగానే తామంతా జగన్‌కు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ప్రతి పల్లెలోనూ కన్పుడుతుందన్నారు. ఈ సందర్భంగా వడ్డెర కాలనీ, బస్టాండ్ సెంటర్, వేణుగోపాలపురంలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నేతలు కృష్ణారెడ్డి, మాలకొండారెడ్డి, మదన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో వరుస చోరీలు!

విలువైన విగ్రహాలు పట్టుకెళ్తున్నారు

జిల్లాలో పలు దేవాలయాల్లో జరుగుతున్న చోరీలు హడలెత్తిస్తున్నాయి. పురాతన ఆలయాలు, పంచలోహ విగ్రహాలపై కన్నేసిన ముఠా ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవాలయాల్లో జరుగుతున్న వరుస చోరీలతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. డిసెంబర్ నెలలోనే వివిధ ప్రాంతాల్లోని 10 దేవాలయాల్లో దొంగతనం జరగడం విశేషం. జలదంకి మండలం బ్రహ్మణక్రాక వేణుగోపాలస్వామి ఆలయంలో కోట్ల విలువ చేసే పురాతన విగ్రహాలు, పంచలోహాలతో చేసిన వాటిని దొంగిలించారు. ఓజిలి మండలం కనుపూరులోని పురాతన శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో నంది విగ్రహాన్ని తస్కరించారు. సంగం మండలం పడమటిపాళెంలోగల షిరిడీ సాయిబాబా మందిరం, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో వెండివస్తువులు, దేవతామూర్తులకు అలంకరించే సామగ్రిని చోరీ చేశారు. సూళ్లూరుపేట మండలం కోటాపోలూరులోని పాలాక్షమ్మ దేవాలయం, కోళ్లమిట్టలోని బాలాత్రిపుర సుందరీ దేవి ఆలయాల్లో హుండీలు చోరికి గురయ్యాయి. ఇలా రోజురోజుకు దేవాలయాల్లో చోరీలు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఆలయాల్లో చోరీలన్నింటిని ఒకే ముఠా చేస్తుందా? లేక వేరు వేరు ముఠాలు చేస్తున్నాయా అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రజల కష్టాలు తీర్చే దేవుళ్లకే రక్షణ కరువవడం విచిత్రం.


ఎవరికీ భయపడను

– తేల్చి చెప్పిన ప్రసన్న




ప్రజలకు తనపట్ల విశ్వాసం వున్నన్ని రోజులు దేనికీ భయపడేది లేదని, ఎవరికీ తలవంచేది లేదని కోవూరు శాసనసభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కోట గ్రామానికి వచ్చిన ఆయన పలు అంశాలపై తనదైన శైలిలో మాట్లాడారు. రాజకీయంగా తాను ఎలాంటి నిర్ణయం తీసుకొన్నా నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకొంటాను తప్ప కొందరు చేసే రాజకీయ బెదిరింపులకు భయపడనన్నారు. భయపడి రాజకీయాలు చేసే అలవాటు నల్లపరెడ్డి కుటుంబానికి లేదన్నారు. కావాలని పనిగట్టుకొని బురద చల్లేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి చరిత్ర ఏమిటో ప్రజలందరికి బాగా తెలుసన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ద్వారా రాజకీయ బిక్ష పొందిన నేతలు నేడు ఆయన కుమారునిపై విమర్శలు చేయడం విచారకరం అన్నారు. రాజశేఖర్‌రెడ్డి జీవించి వున్నంత కాలం ఆయన భజన చేసిన నాయకులు నేడు జగన్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా జగన్ వెంట నడుస్తామన్నారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంపై స్పందిస్తూ ఆనాడు స్పీకర్‌గా వుండిన కిరణ్‌కుమార్ రెడ్డికి తన న్యాయవాది తరపున వాదనను విన్పించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ పతనం అయిపోతున్నదని, దీనికి నిదర్శనం 2004, 2009 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పేనన్నారు.

జై బోలో సెన్సార్




సెన్సార్ పుణ్యమా అంటూ జై బోలో తెలంగాణ చిత్రానికి గడ్డు రోజులు దాపురించాయి. అభ్యుదయ దర్శకుడు శంకర్ నిర్మాతగా కూడా వ్యవహరించి తీసిన ఈ చిత్రం పట్ల తెలంగాణలో ఇప్పటికే ఎంతో క్రేజ్ వుంది. శ్రీకృష్ణకమిషన్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో రచ్చబండ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తేవాలని శంకర్ చేసిన ప్రయత్నానికి సెన్సార్ బోర్డు సైంధవుడిలా అడ్డుగా నిలిచింది. కెసిఆర్‌తోపాటు ఇతర ఉద్యమ నాయకులు కూడా నటించిన ఈ చిత్రం తెలంగాణ ఉద్యమానికి మరింతగా దోహదపడుతుందని అంటున్నారు. తెలంగాణకు సంబంధించిన కొన్ని చేదు నిజాలతోపాటు సీమాంధ్రకు చెందిన నాయకులపై ఇందులో అభ్యంతరకర వ్యాఖ్యలున్నాయని సెన్సార్‌బోర్డు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఈ చిత్రాన్ని కేంద్ర సెన్సార్ బోర్డుకు పంపారు. అక్కడ ముఖ్యమైన సన్నివేశాలకు, అభ్యంతరకర వ్యాఖ్యలకు కత్తెర వేయవచ్చు. అదే జరిగితే తెలంగాణ ఎలా వున్నా సెన్సార్‌పై యుద్ధం మొదలు కావచ్చని టిఆర్ఎస్ వర్గాలంటున్నాయి.

కలిసుందాం రండి!!




రచ్చబండలో ప్రజాసంక్షేమం మాట ఎలావున్నా సిఎం కిరణ్ మాత్రం ఎమ్మెల్యేల్ని దువ్వే కార్యక్రమం చేపట్టాడు. ముఖ్యంగా జగన్ పట్ల మొగ్గుచూపుతున్న ఎమ్మెల్యేల పట్ల కిరణ్ తెగ ప్రేమను చూపుతున్నాడట. రచ్చబండ సమావేశాలకు ఫలానా ఎమ్మెల్యే వచ్చారా! లేదా అంటూ జిల్లా కలెక్టర్‌ను అడుగుతున్నాడట. ఒకవేళ ఎమ్మెల్యే రాకపోతే స్థానిక నాయకుల్ని పంపి తన మాటగా చెప్పి పిలిపించుకుంటున్నాడు. ఎన్నికలకు మరో మూడేళ్లున్నాయి. ఈలోగా మీరు ఏదైనా తీసుకోరాని నిర్ణయం తీసుకుంటే అందరం నష్టపోతాం. మీ ప్రయోజనాల్ని నేను కాపాడతాను. మీరు మాత్రం జగన్ మాయలో పడొద్దు అంటూ కిరణ్ బుజ్జగింపు చేపడ్తున్నాడు. దీంతో జగన్ మద్దతుదారులకు ఏం పాలుపోవడం లేదు. రాజకీయంగా తాడో పేడో తేల్చుకుందామనుకుంటున్న ఈ సమయంలో రచ్చబండ పుణ్యమా అని సిఎం ఎమ్మెల్యేల్ని బుట్టలో వేసుకుంటున్నాడంటూ జగన్ వర్గీయులు డైలామాలో పడ్తున్నారట.

దటీజ్ శంకర్రావ్




రాష్ట్రమంత్రి శంకర్రావ్ వైఖరి ఎవరికీ మింగుడు పడటం లేదు. పూటకోమాట... గంటకో సిద్ధాంతం చెబుతూ శంకర్రావు అందర్నీ గందరగోళంలో పడేస్తున్నాడు. జగన్ తనకు బిడ్డలాంటి వాడంటూనే ఆయనపై హైకోర్టుకు ఓ అవినీతి చిట్టాను పంపాడు. దాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకొని సంబంధిత వ్యక్తులందరికీ నోటీసులు జారీ చేసింది. దీంతో జగన్ వర్గం దిగ్భ్రాంతికి గురైంది. జన దీక్షలతో, జల దీక్షలతో జనంకు దగ్గరవుతున్న సమయంలో శంకర్రావు ప్రయోగించిన ఈ గుగ్లీకి వారంతా నివ్వెరపోతున్నారు. కాగా రాజకీయంగా బద్ధవైరమున్న చంద్రబాబును శంకర్రావు ఆకాశానికి ఎత్తుతున్నాడు. చంద్రబాబు ఎంతో మంచినాయకుడంటూ కితాబిచ్చాడు. మామను వెన్నుపోటు పొడిచి వస్తే ఆ తర్వాత ఎన్నికల్లో బాబు ఎలా గెలిచాడంటూ శంకర్రావు పొగడ్తలతో ముంచెత్తడం కాంగ్రెస్ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అయితే శంకర్రావు పొగిడాడంటే వారికి మూడినట్టేనంటూ గాంధీ భవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. దటీజ్ శంకర్రావ్!

నాగం ఆగంకు బ్రేక్



తెలుగుదేశం తెలంగాణ ఫోరం కన్వీనర్‌గా పార్టీలో ఆగం చేస్తున్న నాగం జనార్దనరెడ్డికి చంద్రబాబు బ్రేక్ వేశాడు. తెలంగాణ తెలుగుదేశం పేరుతో పార్టీ ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలన్నది నాగం డిమాండ్. దీంతో చంద్రబాబు పరిస్థితి ఇరకాటంలో పడింది. తెలంగాణకు పార్టీ ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తే తాను కేవలం ఆంధ్ర ప్రాంతానికే పరిమితం కావల్సివస్తుంది. అదీగాక సమైక్యాంధ్ర అంటున్న పార్టీ వర్గాల మనోభావాల్ని దెబ్బతీసినట్లవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా నాగంను పిలిపించి బుజ్జగించే ప్రయత్నం చేశాడు బాబు. కానీ నాగం వినకుండా పార్టీని వదిలి వెళ్తానంటూ ఝలక్ ఇచ్చాడు. అయితే బాబు భయపడకుండా అలాగే అన్న సందేశాన్ని పంపాడు. అంతేకాకుండా ఎమ్మెల్యే నరసింహుల్ని దువ్వి నాగంకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇప్పించాడు. దీంతో నాగం ఓ అడుగు వెనక్కు వేశాడు. ప్రస్తుతం తెలంగాణ శాఖ లేదంటూ నాగం చేతనే చెప్పించి బాబు చక్రం తిప్పాడు. దీంతో నాగం ఆగంకు బ్రేక్ పడింది.

అంతా సత్యనారాయణ మహత్యం



ముఖ్యమంత్రి పేషీలో ముఖ్యకార్యదర్శిగా వున్న జె.సత్యనారాయణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాడు. నిజాయితీపరుడిగా పేరున్న సత్యనారాయణ ప్రతీ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటం వల్ల ముఖ్యమైన ఫైళ్లు రోజుల తరబడి పేరుకు పోతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రుల పేషీల్లో పని చేస్తున్న వ్యక్తిగత సిబ్బంది నియామకాలకు సంబంధించిన ఫైలు కూడా సత్యనారాయణ వద్దనే కునికి పాట్లు పడుతోంది. మంత్రుల పేషీల్లో పిఏలు, పిఎస్‌లుగా పని చేస్తున్నవారు సచ్చీలురుగా వుండాలని ఆయన భావిస్తున్నాడట. అందుకే అందరిపై ఇంటెలిజెన్స్ నివేదికలు తెప్పించుకొని మంచివారికి మాత్రమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని నిర్ణయించాడట. దీంతో రెండు నెలలుగా జీతాలు లేక సిబ్బంది తెగ ఇబ్బంది పడుతున్నారు. కాగా తన దగ్గరకు వచ్చే ప్రతీ ఫైలును జల్లెడపడ్తుండటం వల్ల సహజంగానే జాప్యం జరుగుతోంది. దీంతో మంత్రులు, ఐఎఎస్‌లు సత్యనారాయణ వైఖరిపై కారాలు మిరియాలు నూరుతున్నారు. కొందరు మంత్రులు ఇప్పటికే సత్యనారాయణ పై సిఎంకు ఫిర్యాదు కూడా చేశారట.





రిపబ్లిక్ డేను పురస్కరించుకొని కస్తూరిబా కళా క్షేత్రంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో స్కూల్ విద్యార్థుల ప్రదర్శన.




ఆంజనేయార్చన ప్రశస్థం!

పవన పుత్రుడు ఆంజనేయుడు పరమ శక్తి మంతుడు, భక్తాగ్రేసరుడు. శ్రీరాముని బంటుగా సేవలందించిన ఆంజనేయుని ఆరాధన ప్రశస్థమైనది. సకల గ్రహదోషాలు ముఖ్యంగా శని, రాహుగ్రహ, వికారాలతోపాటు అన్ని రకాల బాధలు తొలగుతాయని, సర్వదోషాల నుంచి విముక్తి లభిస్తుందని కార్యసిద్ధి పొందుతారని 'కాళికా రహస్యం'లో చెప్పబడింది.

సర్వగ్రహదేవతార్చనలకు మూలమైన ఆంజనేయుని కొలవడం ద్వారా సుఖసంతోషాలు, సకల శుభాలు కల్గుతాయని పురాణాలు చెప్తున్నాయి. శని, మంగళవారాలు హనుమంతునికి ప్రీతికరమైనవి. ఆ రోజుల్లో ఆంజనేయునికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన, వడమాల, సింధూరార్చన చేసినట్లయితే కోరిన కోర్కెలు తీరుతాయని మహర్షుల ఉవాచ.

తమలపాకులతో అర్చన చేయడం వలన ఆ ఆకుల నుంచి స్వామి యొక్క శక్తి భక్తులకు లభించి ధైర్యాన్ని, కార్యసిద్ధిని పొందగలుగుతారు. వడమాల సమర్పించడం వలన రాహుగ్రహ వికారాలన్నీ తొలగిపోతాయని, సింధూర పూజ ఆయా వ్యక్తుల పరస్పర అనురాగానికి చిహ్నంగా చెప్పబడుతోంది. ఈ పూజలు చేయడం వలన గ్రహాల్లో ప్రధానమైన శనిగ్రహ దోషాలు తొలగడంతో పాటు అష్టమ శని బాధలు, చతుర్థాష్టమి శని బాధలు, ద్వాదశ, ఏళ్లనాటి శని బాధలు తొలగిపోతాయని స్వయంగా శనేశ్వరుడే ఆంజనేయునికి చెప్పినట్లు హనుమత్ వ్రతకల్పంలో వివరణ వుంది. ఆంజనేయుని హోమం పరమ మంత్ర, యంత్ర, తంత్ర, ఔషధ, పిశాచ బాధల నుంచి దూరం చేసి పరిపూర్ణమైన ఆయురారోగ్యాలను కల్గిస్తుందని పండితులు చెప్తున్నారు. ప్రతి మార్గశిర శుద్ధ త్రయోదశినాడు హనుమత్ వ్రతం చేస్తుంటారు. అదే కాకుండా నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం ఆలయంలో మంగళ, శని వారాల నాడు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఓం నమో రామదూతాయనమ: అనే అష్టాక్షరి నామాన్ని జపించి హోమం చేయడం, పాలు, పెరుగు, తేనెతో అభిషేకాలు జరుగుతాయి. పూర్ణఫలం ఎంతో ప్రసిద్ధి చెందింది. టెంకాయకట్టి 40 రోజులు ప్రదక్షిణ చేసి ఆంజనేయుని పూజించినట్లయితే అనుకొన్న పనులు తీరుతాయని ప్రగాఢ విశ్వాసం.

ట్రంకురోడ్డు





వివేకా దానం

చిత్రవిచిత్ర వేషాలతో నిరంతరం వార్తల్లో వుండే రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి బోడిగాడితోట ప్రాంతంలో కాగితాలు ఏరుకొనే పిల్లలను విస్తుపోయేలా చేశాడు. ఇటీవల ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొనను వెళ్లిన ఆయన్ను ఓ పిల్లవాడు దానమడిగాడు. సహజంగా ఇటువంటి వారిని కోపంగా చూసి బెదరగొట్టే వివేకానందరెడ్డి ఆ పిల్లవాడికి జేబులో నుంచి వంద రూపాయల నోటు తీసి ఇచ్చాడు. దాన్ని తీసుకొన్న బాలుడు ఈ ప్రాంతంలో బాలలందరికీ చెప్పడంతో వారంతా ఆయన్ను చుట్టుముట్టారు. ఏమయ్యిందో ఏమో తెలియదుగానీ వివేకా తాను కారు ఎక్కేవరకు వచ్చి అడిగిన ప్రతి పిల్లవాడికీ వంద రూపాయల నోటును పంచేస్తూ వచ్చాడు. బోడిగాడితోటలోని బాలలకు వివేకా చేసిన భూరిదానం ట్రంకురోడ్డులో చర్చనీయాంశమయ్యింది.

హాట్ కేకుల్లా వైఎస్ స్టాంపులు

రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఎన్టీఆర్‌లా జనాభిమానం పొందిన వ్యక్తిగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని చెప్పుకోవాల్సిందే. వైఎస్ సంస్మరణార్థం భారత ప్రభుత్వం ఆయన ఫోటోతో వున్న స్టాంపును విడుదల చేసింది. ఈ మధ్యే జిల్లాకు వచ్చిన ఈ స్టాంపుల కోసం వైఎస్ అభిమానులు పోస్టాఫీసులపై ఎగబడి కొనేశారు. పోస్టాఫీసుకు వచ్చినవారు వైఎస్ స్టాంపులనే అడుగుతుండడంతో పోస్టల్ సిబ్బంది వారికి సమాధానం చెప్పలేక పోతున్నారు.





రామనారాయణపై కస్సుబుస్సు

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డిపై కస్సుబుస్సు లాడారు. కోవూరులో తనకు తెలియకుండా వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో పాల్గొనడమే గాకుండా వివిధ పనులకు అడ్డు తగులుతున్నాడని విమర్శించారు. మంత్రి తన తీరు మార్చుకోకపోతే ఆయన ఇంటి ముందు నిరసన దీక్ష చేస్తానన్నాడు. ఈ మధ్య వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో తిరుగుతున్న ప్రసన్న ఆయన తరహాలోనే పోరుబాటకు దీక్షను ఎన్నుకొన్నట్లుందని జనం గుసగుసలాడుకొంటున్నారు.

కొత్త నవాబు



కప్పుడు సింహపురిని పాలించిన చరిత్ర నవాబులకు వుంది. ఒనెల్లూరులో ముస్లిం జనాభా గణనీయంగా వున్నా సమర్థవంతమైన నాయకుడు లేడు. యాహ్యాలిఖాన్, మహబూబ్‌ఖాన్, సందాని వంటి నేతలు మునిసిపల్ ఛైర్మన్, వైఎస్ ఛైర్మన్లుగా అతి కష్టం మీద ఎదిగారు. సందాని మరణం తర్వాత జెండావీధిలో మైనార్టీ నేత అనిపించుకోవాలని పలువురు ఉవ్విళ్లూరుతున్నారు. రొయ్యల వ్యాపారం చేస్తున్న అజీజ్‌కు ఈ ఉరఉర హెచ్చింది. తన కుమారులతోనే తన పేరిట ఓ ట్రస్టు ఏర్పాటుచేసి దాని ప్రారంభోత్సవానికి ఎమ్పీ రాజమోహన్‌రెడ్డిని పిలిచి ఈ వారంలో అలజడి సృష్టించారు. అజీజ్ గతంలో తన స్టార్ ఆక్వా గెస్ట్‌హౌస్‌లో ప్రజారాజ్యం నేత చిరంజీవికి, వైఎస్.జగన్మోహన్‌రెడ్డిలకు బస ఏర్పాటు చేశారు. అజీజ్ ముందు ఏ పార్టీనో తేల్చి చెబితే ఆ తర్వాత ఆ వైపు చేరేదిలేనిది ఆలోచిస్తామంటున్నారు జెండావీధి మైనార్టీలు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

వృత్తిరీత్యా ఉత్సాహం అధికమవుతుంది. చిరకాలంగా ఎదురుచూస్తూ వచ్చిన శుభఫలితాలు అనుభూతిలోకి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. కుజుని, ఆంజనేయుని కొలవాలి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిపరులకు కళాకారులకు మంచి ఆదరణ. విద్యార్థులకు చదువు విషయంలో కొంత మేలు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

మిత్రులు సాయమందిస్తారు. పద్ధతి ప్రకారం పనులు నిర్వహిస్తారు. ప్రయాణాలు సుముఖంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు మీకనుకూలంగా ఉంటాయి. భూభవనాల ద్వారా ఆదాయమార్గాలు సులభతరమవుతాయి. ఇన్నాళ్ళు ఆటంకాలతో అడ్డుపడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. వ్యాపారులకు ప్రోత్సాహకరమైన వారం. రాజకీయులకు ప్రోత్సాహం తక్కువ.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థిక విషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలు జాగ్రత్త. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పైవారిని విమర్శించకుండాలి.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

చిన్న చిన్న సమస్యలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. రాజకీయులకు మేలైన కాలం. కళాకారుల ప్రతిష్ఠ పెరుగుతుంది.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. మిత్రులమూలంగా మేలు. ధనవిషయాలలో లోటు లేదు. వివిధమార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగుతాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. వివాహాది శుభకార్యాచరణకు శ్రీకారం చుడతారు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. జీర్ణకోశ సంబంధిత బాధలు. రాజకీయులకు ఉత్తమకాలం. విద్యార్థులకు శ్రమ.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ఆర్థిక లావాదేవీలు మీకనుకూలంగా ఉంటాయి. ఇన్నాళ్ళు ఆటంకాలతో అడ్డుపడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. భూభవనాల ద్వారా ఆదాయమార్గాలు సులభతరమవుతాయి. వ్యాపారులకు ప్రోత్సాహకరమైన వారం. వారసత్వాలు లాభిస్తాయి. రాజకీయులకు ప్రోత్సాహం తక్కువ. కళాకారులు అవమానానికి గురవుతారు.

వారఫలాలు

తేది 29-1-2011 నుండి 4-2-2011 వరకు మకరంలో రవి, కుజులు; ధనుర్మకరాలలో బుధుడు; ధనుస్సులో రాహువు; వృశ్చిక, ధనుస్సులలో శుక్రుడు; మీనంలో గురువు; కన్యలో శని; మిథునంలో కేతువు; వృశ్చిక, ధనుర్మకర కుంభాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

30తేది గాంధీ వర్ధంతి.

శుభ ముహూర్తాలు లేవు

జనవరి తిథులు
పుష్య బహుళ

29	శని	ఏకాదశి	తె.3.58	గం.ల.వ
30	ఆది	ద్వాదశి	తె.4.22	గం.ల.వ
31	సోమ	త్రయోదశి	తె.5.11	గం.ల.వ

ఫిబ్రవరి తిథులు

1	మంగళ	చతుర్దశి	తె.6.23	గం.ల.వ
2	బుధ	అమావాస్య		పూర్తిగా
3	గురు	అమావాస్య	ఉ.7.56	గం.ల.వ

మాఘ శుద్ధ

4	శుక్ర	పాడ్యమి	ఉ.9.50	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలందవు. ఊహించని రీతిలో ధనవ్యయమవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టలైన వారికిగాను ఖర్చు అవవచ్చు. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. వ్యాపారులకు, వృత్తిపరులకు మేలైన కాలం గాదు. గృహిణులకు సంతానమూలంగా మనశ్శాంతి ఉండదు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

సోదరులకు మేలు చేస్తారు. ప్రయాణాలలో సత్ఫలితాలు ఎదురు చూడవచ్చు. చిన్న చిన్న సమస్యలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి.



ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఊహించనిరీతిలో ధనవ్యయం అవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టలైన వారికి గాను ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయసహకారాలు అందుతాయి. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. శనిని ఆంజనేయుని తప్పక కొలవాలి. శరీరానికి గాయాలు తగులకుండా చూచుకోవాలి. ఆర్థిక సమస్యలుంటాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థిక లావాదేవీలు జాగ్రత్త. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పైవారిని విమర్శించకుండాలి. విద్యార్థులు చదువు విషయంలో శ్రద్ధ చూపాలి. కళాకారులు వృత్తిపరులు జాగ్రత్తగా మెలగాలి. ఉద్యోగులు అధికారుల ఒత్తిడికి గురి అవుతారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

ఆర్థిక విషయాలు అంతంత మాత్రమే. ప్రయాణాలు అనుకొన్నవి అనుకొన్నరీతిలో జరుగవు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటు చేసుకొంటుంది. ఎదురుచూసిన సత్ఫలితాలు దక్కవు. ఎవరికి ఎలాంటి మాట ఇవ్వవద్దు. విద్యార్థులకు కొంత మేలు. వృత్తిలో ముందంజ వేయలేరు.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

ధన విషయాలలో లోటు లేదు. వివిధమార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగుతాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. వివాహాది శుభకార్యాచరణకు శ్రీకారం చుడతారు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. రాజకీయులకు ఉత్తమకాలం. వ్యాపారులకు మంచి లాభావకాశాలు. విద్యార్థులకు శ్రమ.

యంత్ర ప్రతిష్ఠ వాస్తు దోషాలను నిలువరిస్తుంది!

బి.కిరణ్మయి నెల్లూరు

** మెట్ల స్తంభంపై ఆధారపడడం మంచిదేనా?*

స్తంభ నిర్మాణం అగాధమై 'దోషయుక్త' మౌతుంది. అలాంటి పరిస్థితుల్లో 'కూర్మయంత్ర' ప్రతిష్ట చేయాలి.

టి.ఎన్.శ్యామలగౌరి తడ

** వీధి ఒకటి మా అపార్టుమెంటును తాకుతున్నది. క్రింది అంతస్తుకేనా పైవాటిపై కూడా ప్రభావం ఉంటుందా?*

అది నైరుతి వీధిపోటు, చూపు పోట్ల ప్రభావాలు అన్ని అంతస్తులపైనా సమంగానే వుంటాయి. మీరు 'సుదర్శన యంత్ర' ప్రతిష్ట చేసుకోండి.

ఎం.శ్వేతారెడ్డి కడప

** మెట్ల క్రింద లెట్రిన్, బాత్‌రూంలు రావచ్చా?*

ఆగ్నేయంలో వ్యాధి, నైరుతిలో మరణం, వాయువ్యంలో విభేదాలు, ఈశాన్యంలో దారిద్ర్యం అని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఎన్.అంకయ్యచౌదరి నెల్లూరు

** వెంటనే వాస్తు దోషాలు సరిచేసుకోలేని స్థితిలో గృహస్థులేం చేయాలి?*

యంత్ర ప్రతిష్ట ఆరు మాసాల కాలం దోషాల్ని నిలువరింపజేస్తుంది. ఆపై దోషాలు తిరిగి విజృంభిస్తాయి.

ఎం.అభిరాం చిత్తూరు

** గృహం వెనకాల త్రిభుజాకార స్థలంలో భవన నిర్మాణం చేశాము.*

హిందూత్వ సంస్థకు చెంది వుండి భారతీయ శాస్త్రమైన వాస్తుపై మీరు చూపిన నిర్లక్ష్యానికి అనుభవించడమొక్కటే మీ తక్షణ కర్తవ్యం. ఈ పరిస్థితి నుంచి ఎవరూ గట్టెక్కించలేరు.

ఇ.వి.గోవిందరెడ్డి బెంగుళూరు

** భోజనం ఏవైపు తిరిగి చేయాలి? ఫలితాలు దక్కడం లేదు.*

భోజనం తూర్పు వైపు తిరిగి చేయాలి. పశ్చిమం వాతం, దక్షిణం పైత్యం, ఉత్తరం శీతలమని శాస్త్రాలు చెబుతున్నాయి.

డి.వి.శ్యామలారాణి చెన్నై

** మా యింటికి ఈశాన్యం వీధి తగులుతున్నది. అందరూ చెప్పినట్లుగా మంచి జరగడం లేదు.*

మధ్యలో ఆగని ఈశాన్య వీధి చూపు కొంత మంచి చేసినా 'దిష్టి' దోషాన్ని మాత్రం కలుగ జేస్తుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

దిద్దిబొట్ల శాస్త్రి చెన్నై

** ప్రాచీన వాస్తు గ్రంధాలు లభ్యం కావడం లేదు.*

ప్రభుత్వ చొరవ, యూనివర్శిటీల ముందు చూపు, మేధావుల నిర్లక్ష్యం అందుకు కారణం. చాలా శాస్త్రాలు అంతరించిపోవడానికి ఈ నిర్లక్ష్యమే కారణం.

ఎన్.జయంతి రామారావు విజయవాడ

** గృహ నిర్మాణం జరిగి ఆరు మాసాలు గడిచాయి. ప్లాను పంపిస్తున్నాను.*

లక్షలు పోసి కట్టినపుడు ఇంట్లో వాళ్ల అభిరుచికి అనుగుణంగా వాస్తు చూపించవలసింది. ఇక ఇప్పుడే చిట్కాలు పనిచేయవు. సరిచేసుకోవడానికి అయ్యే ఖర్చుకు వెనకాడితే అవాస్తు దోషాలు మరింతగా ప్రభావాన్ని చూపిస్తాయి.

పి.హనుమంతరావు కడప

** 'స్థల శుద్ధి' అంటే ఏమిటి?*

నిర్మాణం తలపెట్టిన స్థలంలో తొమ్మిది గుంతలు(2×2) అడుగులవి త్రవ్వి, అందులో ఎముకలు, పాత ఇటుక, వెంట్రుకలు, పాత వస్తువులు రాని పక్షంలో వాటిని తిరిగి పూడ్చి, దిశలవారీగా భూమిని సర్దివేయాలి. ఈ తతంగాన్ని 'స్థలశుద్ధి' అంటారు.

ఎసిబి కేసులు బుట్టదాఖలు!

నెల్లూరు అవినీతి నిరోధక శాఖాధికారులు నానాపాట్లు పడి అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వాధికారులను పట్టుకొంటే వారిపై చర్యలకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై అవినీతి నిరోధక శాఖాధికారులు సమర్పించిన నివేదికలపై ప్రభుత్వం స్పందించడం లేదు. వివిధ వర్గాల ప్రజలు, సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎసిబి అధికారులు పరిగణలోకి తీసుకుంటారు. స్వీకరించిన ఫిర్యాదులపై ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడేవారిపై నిఘా వుంచి అనంతరం కార్యాలయాలపై దాడులుచేసి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంటారు.

ఒక్కో ప్రభుత్వ కార్యాలయంలో రెండు, మూడు రోజులు కూడా తనిఖీలు చేయాల్సి వస్తుంది. ఈ తనిఖీల్లో అక్రమాలు బహిర్గతమైతే సదరు ఉద్యోగిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నివేదిక పంపుతుంటారు. ఎసిబి అధికారులు ఎంతో కష్టపడి అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై నివేదిక రూపొందించి పంపుతుంటే అధికారులతోపాటు ప్రభుత్వం కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సిబ్బంది, అధికారులకు పూర్తిగా భయం లేకుండా పోవడంతోపాటు, మరిన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు.

చర్యలేవి?

లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడిన అధికారి, సిబ్బందిని మాత్రమే ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేస్తుంది. ఎసిబి సోదాలు, తనిఖీల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ శాఖల అధికారులు ఏదో ఒకవిధంగా రాజకీయ సిఫార్సులు చేయించుకొంటూ తప్పించుకొంటున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం వైపు నుంచి అవినీతి అధికారులపై చర్యలు లేకపోవడంతో ఎసిబి అధికారుల్లో కూడా పారదర్శకత లోపించే అవకాశం ఏర్పడుతోంది.

ప్రత్యక్షంగా కనుగొన్నారు!

ఇటీవల జిల్లాలో రవాణాశాఖ కార్యాలయం, సంక్షేమశాఖలకు చెందిన వసతి గృహాలు, తడ సమీపంలోనున్న ఉమ్మడి తనిఖీ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుండడాన్ని ప్రత్యక్షంగా ఎసిబి అధికారులు కనుగొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణకు కొనుగోలు చేసిన సామగ్రి నాసిరకంగా వుండడాన్ని కూడా అధికారులు గుర్తించడం జరిగింది. తడ చెక్‌పోస్టు వద్ద ఒక గంటలో 26వేల రూపాయలు మామూళ్లు వసూలు చేయడంపై ఎసిబి అధికారులు నివ్వెర పోయారు. అలాగే నెల్లూరు నగరంలోని రవాణాశాఖ కార్యాలయం, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో దళారులు నగదు వసూలు చేయడాన్ని గుర్తించారు.

పై శాఖల్లో నేరుగా లంచం తీసుకోకపోయినా దళారుల ద్వారా నగదు వసూలు చేయించడం కూడా ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుంది. అయితే ఎసిబి అధికారులు సమర్పించిన నివేదికపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ప్రభుత్వానికే తెలియాలి. రెండు నెలల క్రితం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వెంకటాచలం మండలం గొలగమూడిలో ఆశ్రమ పాఠశాలపై ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి మెనూ ప్రకారం ఆహారపదార్థాలు అందించక పోవడాన్ని గుర్తించారు. అంతే కాకుండా వసతి గృహంలో తక్కువ మంది విద్యార్థులుంటే ఎక్కువమంది విద్యార్థులున్నట్లు హాజరు వేసి వుండడాన్ని గమనించారు. ఆశ్రమ పాఠశాల నిర్వహణ, వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, వార్డెన్ ఖర్చు చేసిన నిధులకు చాలా వ్యత్యాసం కనిపించింది. ఆశ్రమ పాఠశాల వార్డెన్ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించిన ఎసిబి అధికారులు తగిన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

ఎసిబి అధికారులు దాడులు చేసి అక్రమాలు గుర్తించడంతో సదరు వార్డెన్‌పై చర్యలు తీసుకోవడం ఖాయమని కొందరు భావించగా, అరెస్టు కూడా చేసే అవకాశం వుందని గిరిజన సంక్షేమ శాఖలో పెద్ద చర్చ జరిగింది. చివరకు అందరి అభిప్రాయాలు తారుమారయ్యాయి. జిల్లాస్థాయిలోనే వార్డెన్‌పై చర్యలు తీసుకునే అవకాశం వున్నప్పటికీ రాజకీయ జోక్యం కారణంగా నిలచిపోయింది.



నెల్లూరు అవినీతి నిరోధక శాఖ కార్యాలయం.

20 సూత్రాల పథకం

20 సూత్రాల పథకం అమలు మరిచారు!

జిల్లాలో 20 సూత్రాల పథకం అమలు పట్ల రాష్ట్ర కమిటీ ఛైర్మన్ తులసీరెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిధులున్నా వినియోగించని తీరును తీవ్రంగా ఆక్షేపించారు.


20 సూత్రాల అమలు పథకం సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ ఛైర్మన్ తులసీరెడ్డి. ప్రక్కన కలెక్టర్ రాంగోపాల్.

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 20 సూత్రాల పథకం సక్రమంగా అమలు జరగడం లేదు. సమీక్షా సమావేశం నిర్వహించిన సమయంలో మాత్రమే ఈ పథకం ఏ విధంగా అమలు చేస్తున్నారో బహిర్గతమవుతుంది. మిగిలిన రోజుల్లో దీని గురించి పట్టించుకునే దిక్కు లేకుండా పోయారు. ఒక్కో శాఖకు సంబంధించి అమలు చేయాల్సిన అంశాలను రాష్ట్రప్రభుత్వం ముందుగానే రూపొందించింది.

అయితే అమలు చేసే విషయంలో మాత్రం వెనుకంజ వేస్తున్నారు అధికారులు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ఎపి ట్రాన్స్‌కో, గృహనిర్మాణశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, ఇందిర క్రాంతి పథం, సామాజిక వన విభాగం, పంచాయితీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖ, పౌరసరఫరాలశాఖ, గ్రామీణ పారిశుద్ధ్య మిషన్ తదితర శాఖలు 20 సూత్రాల పథకం అమలు చేయాల్సి వుంది. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 20 సూత్రాల పథకంలో 13 సూత్రాలను గుర్తించి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

స్వయం సహాయక సంఘాలకు ఆదాయం సమకూర్చే కార్యక్రమాలను అమలు చేయడం, ఇందిర ఆవాజ్ యోజన పథకం క్రింద పక్కా గృహాలను నిర్మించడం, అంగన్‌వాడి కేంద్రాల పనితీరు మెరుగుపరచడం, పట్టణ ప్రాంతాల్లో వున్న పేద కుటుంబాలకు సహాయం అందించడం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకం క్రింద రోడ్లను నిర్మించడం, రాజీవ్ ఆవాస్ యోజన పథకం క్రింద గ్రామాల్లో విద్యుత్ సర్వీస్‌లను అందించడం, రక్షిత మంచినీటిని సరఫరా చేయడం, ఎస్సీ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో మొక్కలు పెంచడం తదితర అంశాలు ఈ పథకంలో చేర్చారు.

20 సూత్రాల పథకం కార్యక్రమం అమలు తీరును జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, ప్రణాళికశాఖ అధికారి సమీక్షించాల్సి వుంటుంది. రాష్ట్రస్థాయిలో సచివాలయంలో ప్రతినెల సమీక్షిస్తారు. మండలస్థాయి అధికారుల నుంచి సేకరించిన వివరాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపాల్సి వుంటుంది. అయితే ఈ పథకం అమలు తీరు గురించి సంబంధితశాఖ అధికారులకు సరైన అవగాహన లేదని తెలుస్తుంది. దీంతో 20 సూత్రాల కార్యక్రమం వెనుకబడిపోయింది. ప్రత్యేకంగా ఈ పథకంపై దృష్టి సారించి పారదర్శకంగా అమలు చేయాలన్న దానిపై అవగాహన కల్పించబడలేదు.

ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన ఈ పథకం అమలు కమిటీ ఛైర్మన్ తులసీరెడ్డి అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. జిల్లా నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించి కేంద్రప్రభుత్వానికి పంపుతామని, అక్కడ అధికారులు నివేదికలపై అసంతృప్తి చెందే అవకాశం వుందన్నారు. 20 సూత్రాల పథకం అమలు కోసం నిధులున్నా కూడా వినియోగించలేని పరిస్థితి వుంది. ఏది ఏమైనా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇకనైనా అధికారులు పని చేస్తే మంచిది.

కొత్త అందాల పరిచయమది!

పరభాషా నటుల రాకతో తెలుగు నటులకు అవకాశాలు తగ్గుతున్నాయన్న వాదనను హీరోయిన్ స్వాతి ఒప్పుకోవడం లేదు. కథ, స్క్రీన్‌ప్లే అప్పుల్లాజు షూటింగ్ గ్యాప్‌లో ఈ విషయమై మాట్లాడుతూ ఎవరో వచ్చి మన అవకాశాలను లాగేసుకుంటున్నారు అని ఎందుకు అనుకోవాలి. కొత్త తరహా అందాన్ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారని అనుకొంటే సరిపోయే. దీంట్లో నిర్మాతల తప్పులు వెతకడం అనవసరం. మన దగ్గర టాలెంట్ వుంటే ఎక్కడైనా ఒకటే. నేను తెలుగు అమ్మాయినైనా తమిళంలో సినిమాలు చేయడం లేదా అంటూ చెప్పుకొచ్చింది.



హద్దు దాటలేదు!



దేహప్రదర్శన చేయాలని ఏ నటీ కోరుకోదు. ఆయా పాత్రలు సన్నివేశాలు డిమాండ్ చేస్తాయి. ఎవరైనా ఆ ప్రకారమే నడుచుకోవాలంటుంది హీరోయిన్ విమలారామన్. తనకు కొన్ని హద్దులున్నాయని వాటిని దాటి వెళ్ల లేదంటుంది. భరతనాట్యంలో ప్రావీణ్యమున్న ఈ హీరోయిన్ కన్నడ 'ఆప్తరక్షక'లో చంద్రముఖి పాత్రను చక్కగా పోషించింది. తెలుగులోనూ ఇలాంటి అవకాశం వస్తే తానేమిటో నిరూపించుకొంటానంటుంది. ఎక్స్‌పోజింగ్‌లో మీకు పెద్దగా పట్టింపులు లేనట్లున్నాయే అంటే; గాయం-2 సినిమా విడుదలయ్యాక అందరూ ఇదే విషయాన్ని అడుగుతున్నారు. అక్కడ భార్యాభర్తలుగా ఎలా వుండాలో అలాగే నటించా. అంతకుమించి ఏముంది. దాన్నే ఎక్స్‌పోజింగ్ అంటే ఎలా? నటనకు ప్రాధాన్యమున్న సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మంచి అవకాశాలొస్తే నేనేమిటో నిరూపించుకొంటానంటుంది.

హిందీ చిత్రంలో నికీషా!



పులి సినిమాతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిలదొక్కుకొంటానని హీరోయిన్ నికీషా పటేల్ ఆశించింది. ఈ సినిమా చిత్రీకరణ దశలో వున్నప్పుడు కొందరు నిర్మాతలు ఆమెను నటించమని అడిగితే కాస్త గర్వంతో సినిమా రిలీజ్ కానివ్వండి చూద్దామని తిరస్కరించింది. కాని తెర మీద ఈ ఆడపులి ఏమాత్రం ఆకట్టుకోలేకపోవడంతో వస్తాయనుకొన్న సినిమాలు చేజారిపోయాయి. చివరికి ముంబైకి మకాం మార్చిన ఈ భామకు హిందీ చిత్రదర్శకుడు సుభాష్ ఘాయ్ నుంచి పిలుపొచ్చింది. దీంతో ప్రాణమొచ్చిన నికీషా హిందీ పరిశ్రమ నన్ను గుర్తించింది. సుభాష్ ఘాయ్ సినిమాలో నటించడం అంటే సినిమాకు సంబంధించి ఎన్నో పాఠాలు నేర్చుకొంటున్నట్టే. తెలుగులో నా ప్రయాణం ముగిసినట్లే అనుకోను. అవకాశాలు వస్తున్నాయి. అవి చర్చల దశలో వున్నాయంది.

శక్తి చూపే యత్నం!



జూనియర్ ఎన్టీఆర్ నటించిన రెండు చిత్రాలు గత ఏడాది విడుదలయ్యాయి. ఈ యేడాది ఆయన రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. వైజయంతి మూవీస్ పతాకంపై తయారవుతున్న శక్తి చిత్రంలో ఎన్టీఆర్ హీరో. ఇలియానా హీరోయిన్. తెలుగులో అత్యంత భారీ బడ్జెట్ చిత్రమిది. దర్శకుడు మోహర్ రమేష్ దేశంలోని పలు కీలక ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చేశారు. గ్రాఫిక్స్ భారీస్థాయిలో వున్నాయి. ఎన్టీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నటించిన ఈ చిత్రం ఆయనలోని నటనాశక్తినంతా చూపిస్తుందంటున్నారు. చూద్దాం... ఎలా వుంటుందో?

ఆకర్ష మంత్రం

ఇటలీలో శిల్పాలు తాత్కికంగా కనిపిస్తాయి. రోమ్ నగరం చాలా అందంగా వుంటుంది. వీటి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవచ్చంటుంది ఏక్ నిరంజన్ ఫేం హీరోయిన్ కంగనా రనౌత్. అదెలాగని అడిగితే... నటీనటులంతా దేశ విదేశాలను చుట్టొస్తాం. అక్కడ చూసిన విషయాలు కొన్ని వ్యక్తిగతంగా అనుభూతిని పంచితే... మరికొన్ని నటనపరంగా పనికొస్తాయి. మనల్ని ఆకట్టుకొనే విషయమేదైనా ఎదురుగా కనిపిస్తే... అలాంటి ఆకర్షణ మనమెందుకు కాకూడదు అనిపిస్తుంటుంది. ఈ విషయాలను దర్శకులను ఒప్పించి తెరపై కొన్ని ప్రయత్నాలు చేస్తుంటానంది. ఇదే స్ఫూర్తితో కొన్ని చిత్రాల్లో మార్లిన్ మన్రో, జీనత్ అమన్, ముంతాజ్, శ్రీదేవిలా నటించి ప్రేక్షకులను ఆకర్షించానంటుంది.





ఆకట్టుకోని అనగనగా ఓ ధీరుడు!

✍ అల్లూరు రహీం

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో లబ్ధ ప్రతిష్టులైన దర్శకులు కె.ఎస్.ప్రకాశరావు, కె.రాఘవేంద్ర రావు వారసత్వాన్ని కొనసాగించను వచ్చిన యువ దర్శకుడు ప్రకాష్ కోవెల మూడి అంతర్జాతీయ సాంకేతిక హంగు లద్ది తీసిన చందమామ కథే అనగనగా ఓ ధీరుడు చిత్రం. ప్రపంచ ప్రఖ్యాత వాల్ట్‌డిస్నీ సంస్థతో కలసి కె.రాఘవేంద్ర రావు స్వయంగా నిర్మించిన ఈ చిత్రంలో 75నిమిషాలపాటు గ్రాఫిక్స్ వున్నా ప్రేక్షకులను పెద్దగా అలరించలేదు. దీనికి కారణం దర్శకుడు వ్రాసుకొన్న నత్తనడక స్క్రీన్‌ప్లేననక తప్పదు. సాంకేతిక హంగులేవీ లేని రోజుల్లో దర్శకుడు విఠలాచార్య ఇటువంటి జానపద కథలను ఒంటిచేత్తో తీసి పారేశాడు. వాటిలో అన్ని హంగులుండడం వల్ల నేటికి ఆ చిత్ర రాజాలను జనాలు ఎగబడి చూస్తున్నారు. అనగనగా ఓ ధీరుడు చిత్రాన్ని దర్శకుడు పిల్లలనే లక్ష్యంగా పెట్టుకొని తీసినట్లున్నాడు. అందువల్లే ఈ చిత్రం పెద్దలను ఆకర్షించదు. ఈ చిత్రంలో హీరో అయిన ధీరుడిని గుడ్డివాడిగా వుంచవలసిన అవసరం లేదు. రెండు రీళ్లలో ముగ్ధమనోహరంగా చూపిన హీరోయిన్ శృతిహాసన్‌ను ఒక్కసారిగా కథ నుంచి ప్రక్కకు త్రోసేస్తాడు. కథంతా కనపడేది తండ్రి మోహన్‌బాబు నుంచి విలనీయాన్ని వారసత్వంగా పుణికి పుచ్చుకొన్న మాంత్రికురాలు ఐరేంద్రి పాత్రలో మంచు లక్ష్మి. ఆమెకు ప్రత్యర్థిగా మోక్ష పాత్రలో బేబి హర్షిత. లక్ష్మి నుంచి అద్భుత నటనను రాబట్టిన దర్శకుడు బాలనటి పేలవ నట ప్రదర్శన చేస్తున్నా ఎందువల్లో పట్టించుకోలేదు. కాని కళాదర్శకుడు భూపతి రూపొందించిన అంగరాజ్యం, ఆగర్తలరాజ్యం, పుష్ప గిరికొండలు, సర్పశక్తి ఆవాసం సెట్టింగులు అద్భుతంగా వున్నాయి. ఐరేంద్రి తనలోని శక్తియుక్తులు ప్రదర్శించే సమయంలో విజువల్ ఎఫెక్ట్స్, మోక్ష చేతుల్లో సీతాకోక చిలుకలు, హీరోయిన్ పగుల గొట్టే బుడగలు, ఆమెపై వర్షించే గులాబీ రేకులు, ఆమెను కాపలా కాసే మహా సర్పాలు, కాకాసురుల పేరిట కాకుల కలకలం వంటివి బాగున్నాయి. నలుగురు సంగీత దర్శకులు కీరవాణి, సలీం – సులేమాన్, మిక్కీ జె మేయర్, కోటీ సంగీతం కూర్చిన పాటల్లో ఒక్క పాట చందమామలా అందగాడినే బాగుంది. శశి రాజసింహ వ్రాసిన డైలాగులు బాగానే వున్నా తరచూ భూత పదాల్లా దిమ్మ...దానిమ్మా, పూరకే దోపేస్తున్నావు, దిబ్బ... వాడబ్బా వంటి బూతులు దొర్లాయి. జ్ఞానులు రేపటి గూర్చి ఆలోచిస్తారు. విశ్వాసం వారసత్వం కాదు... నమ్మకంతో వస్తుంది వంటి మాటలు ఆలోచింప జేస్తాయి. వాల్ట్‌డిస్నీ సంస్థ రూపొందించిన చిత్రం లోనూ జిలేబి, జఫాగాడు, గుచ్చేరి పాత్రల్లో అలీ, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి కామెడీ రోతగా వుంది.

చిత్ర సమీక్ష

ఇక చిత్రకథ లోనికి వెళ్తే ఐరేంద్రి (మంచు శ్రీలక్ష్మి) సర్పజాతికి చెందిన ఓ ప్రేతాత్మ. కాలనేత్రంలో నిక్షిప్తమై వుండే ప్రేతాత్మను ఆమె జాతికే చెందిన మునిమనవరాలు ప్రియ (శృతిహాసన్) చేసిన పొరపాటు వల్ల మళ్లీ విజృంభిస్తుంది. ప్రియ రక్తపు బిందువే ఆమెకు ఆహారం. ఆగర్త రాజ్యంలో ఐరేంద్రి జాతీయుల నిక్షిప్తమైన ఆత్మలతో పిల్లలకు సమస్యలు వస్తాయి. వీటి నిర్మూలనకు పుష్ప గిరి కొండల్లో కొలువైన దైవాంశసంభూతురాలైన బాలిక మోక్ష (బేబి హర్షిత)ను తీసుకురావాలని నిర్ణయిస్తారు. ఈమెకు రక్షగా యోధ (సిద్దార్థ)ను పంపుతాడు అక్కడి స్వామి (సుబ్బరాయశర్మ). మోక్ష రక్తాన్ని జుర్రేస్తే ప్రపంచంలో తిరుగులేని శక్తినవుతానని ఐరేంద్రి ఆమెను తన వశం చేసుకోను ప్రయత్నిస్తుంది. ధీరుడు తన మానవశక్తితో ఆమెను మట్టి కరిపించి మోక్షతోపాటు తన ప్రియురాలు ప్రియను రక్షించుకోవడంతో సినిమా పరిసమాప్తమవుతుంది.

ధీరునిగా సిద్దార్థ మంచి నటన ప్రదర్శించాడు. ప్రియగా శృతిహాసన్ ప్రేక్షకులను బ్రహ్మాండంగా ఆకట్టుకొంటుంది. క్రూరంగా కనపడను అద్భుతంగా మేకప్ చేయించుకొన్న ఐరేంద్రిగా శ్రీలక్ష్మిని ప్రశంసించాల్సిందే. తొలిచిత్రం బొమ్మలాట ద్వారా అవార్డులు పొందిన దర్శకుడు ప్రకాష్ మలి చిత్రం అనగనగా ఓ ధీరుడును తీయడంలో మాత్రం బొక్కబోర్లాపడ్డాడు.

శిశు విద్యా కేంద్రాలు

● సఫలమయ్యేనా?



గ్రామీణ ప్రాంతాలలో శిశు విద్యా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వీటిని జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం "బాలబడి" పథకం క్రింద వీటికి నిధుల్ని సమకూర్చుతుంది. స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ వాటి నిర్వహణ, పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శిశు విద్యాకేంద్రాలకు అవసరమైన సిబ్బందిని ఎలా నియమించాలన్న దాని గురించి అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఈ కేంద్రాలను అంగన్‌వాడి సెంటర్లలో తాత్కాలికంగా నిర్వహిస్తామని చెబుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇవి పని చేస్తాయి. ఇప్పటికే చాలీ చాలని సిబ్బందితో స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ కాలం వెళ్లదీస్తోంది. ఇటువంటి పరిస్థితులలో బాలబడి పథకం క్రింద శిశు విద్యా కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ శాఖ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

విధులకు హాజరుకాని అయ్యోర్లపై చర్యలు?

జాబితా సిద్ధం చేసిన విద్యాశాఖ



ఎంతోమంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే మరోవైపు వేలాది రూపాయల జీతం తీసుకొంటూ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారు సెలవుల పేరుతో విధులు ఎగ్గొట్టి సొంత వ్యాపారాలు చేసుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. సంవత్సరాల తరబడి బడి మొహం చూడకుండా వ్యాపారాల్లో మునిగి తేలుతున్న ఉపాధ్యాయులపై ఎట్టకేలకు చర్యలు చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఇలాంటివారు చాలా మంది వున్నా చర్యలు తీసుకొనేందుకు విద్యాశాఖ అధికారులు వెనుకాడుతూ వచ్చారు. గత ఏడాది కర్నూలు జిల్లాలో ఎగనామం పెట్టి సెలవుల్లో వెళ్లిన టీచర్ల సర్వీసు నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించడం సంచలనం రేపింది. దీంతో అప్పటి విద్యాశాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్య ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు నిర్ణయించారు. ఉపాధ్యాయ సంఘాలు దీనిపై అభ్యంతరం తెలిపి మొదటి తప్పుగా పరిగణించాలని కోరారు. కొందరిలో మార్పు వచ్చినా పలువురు తిరిగి యధావిధిగా సెలవులపై వెళ్లడంతో అలాంటి ఉపాధ్యాయులపై కొరడా జుళిపించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. జిల్లాలో ఇలాంటి ఉపాధ్యాయులను 49 మందిని గుర్తించారు. వీరిని ఎందుకు సర్వీసు నుంచి తొలగించకూడదో సంజాయిషీ కోరారు. వ్యాపారాల్లో మునిగి తేలే ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను కాపాడుకొనేందుకు ఉపాధ్యాయ సంఘాల ద్వారా ప్రయత్నాలు ప్రారంభించారు. అధికారులు వెనుకడుగు వేస్తారో, లేక కఠినంగా వ్యవహరిస్తారో వేచి చూడాల్సి వుంది.

పెరిగిన ధరలపై ఆకట్టుకొన్న టిడిపి నిరసన



పెరిగిన పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ నగరంలో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టింది. గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై విరుచుకపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలను చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మరోవైపు పెట్రోల్ ధరలను అమాంతంగా పెంచడంతో ప్రజలు అధికంగా వినియోగించే ద్విచక్ర వాహనాలను నడపలేని పరిస్థితి నెలకొనిందన్నారు. వాస్తవంగా పెట్రోల్ ధర లీటరు 25.51 రూపాయలు అని, వివిధ పన్నులను కలుపుకొంటే 65.18 రూపాయలైందన్నారు. ప్రతి లీటరుపై 39.67 రూపాయలు ప్రభుత్వానికి వసూలవుతున్నదని తనదైన శైలిలో గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యమంత్రి వున్నాడా? ప్రభుత్వం వుందా అన్న అనుమానం కల్గుతున్నాదని విమర్శించారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిపోతే, ఆయన కుమారుడు మరింతగా దోచుకొనేందుకు అధికారం కోసం తహతహలాడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం పెట్రోల్ ధర పెరిగినందున నడపలేమంటూ పలు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు చేసిన నిరసన ఆకట్టుకొంది. 500 రూపాయలకు తెగనమ్మేందుకు కొందరు నేతలు సిద్ధపడగా, మరికొందరు వాటిని కొనేందుకు పోటీలు పడడం ద్వారా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నూనె మల్లి ఖార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు
రూ.500లకే వేలం



రిపబ్లిక్ డే పెరేడ్‌లో పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ దామోదర్.



2జి స్పెక్ట్రమ్ కుంభకోణం బాధ్యులపై చర్య తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు దశరథరామయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు.

ఆస్తి ఎవరిది?

5వ పేజీ కొరవ

కోసం, అమెరికన్ సంస్థను, దీనిని కలిపి ఒక జాయింట్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఏర్పరచారు. మతం, కులం, జాతి, రంగు బేధాలు లేకుండా దేశంలోని పేద ప్రజలందరికీ సేవ చేయాలని, మత ప్రచారం, విద్య, వైద్యసేవలు విస్తృతపర చాలని నిర్ణయించుకొన్నారు. ఈ క్రమంలో దాదాపు 700 క్రైస్తవ ప్రార్థనా మందిరాలు నిర్మించారు. సంస్థలకున్న ఆస్తులను పర్యవేక్షించడానికి సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ అసోసియేషన్‌లోనే ప్రాపర్టీ కమిటీ అనే విభాగం ఒకటి ఏర్పరిచారు. 1973 వరకు ఇదే పద్ధతిలో నడిచింది.

అయితే, ఒకే సంస్థ ఆస్తులను రక్షించడం, సేవా సంస్థలను నడపడం పెద్ద భారంగా కన్పించడంతో, 1973లో ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ స్థాపించారు. ఆస్తుల వ్యవహారాలను ఈ కొత్త కంపెనీ, సేవా సంస్థల నిర్వహణ సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చెస్ అసోసియేషన్ చూచేటట్లు ఏర్పాటు చేశారు. ఈ పని విభజన సమయంలో, అమెరికన్ బాప్టిస్స్ ఫారిన్ మిషన్ సోసైటీ భారత దేశంలోని తన ఆస్తులన్నీటి మీద హక్కును కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాపర్టీ కమిటీకి బదలీ చేసింది. భారతదేశం వరకు ఆ సంస్థ రద్దయినట్లు భావించారు. ఈ ఏర్పాట్లు మద్రాసు హైకోర్టు ద్వారా చట్టబద్ధం చేశారు. ప్రాపర్టీ కంపెనీలో సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చెస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో వుండాలని నిర్దేశించారు.

ఈ పరిణామాల వల్ల భారత దేశంలోని అన్ని ఆస్తులతో పాటు నెల్లూరులోని అమెరికన్ ఆస్పత్రి కూడా ప్రాపర్టీ కంపెనీ ఆస్తిగా మారింది. 1974 మే 2తేది రిజర్వ్ బ్యాంక్ ఈ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

లెక్కలేనన్ని కేసులు

ఈ కంపెనీ వ్యవహారాలు కావలికి చెందిన దేవదానం అనే వ్యక్తి చూసేవాడు. ఆయన, ఇదొక ధార్మిక సంస్థ, దానికి తాను ధర్మకర్త మాత్రమే అన్న వాస్తవం విస్మరించి, ఆ కంపెనీకి తానే యజమాని అన్నట్లు వ్యవహరించేవాడు. ఆయన మరణం తర్వాత ఇప్పుడా కంపెనీ సంగతులు చూస్తున్న ఆయన కుమారుడు దివాకర్ కూడా అదే పోకడలో వున్నాడు. దాన్ని ప్రతిఘటించడానికి మద్రాసు హైకోర్టులో లెక్కలేనన్ని కేసులు నడిచాయి, నడుస్తున్నాయి. వాటిలో కీలకమైనది 1994లో సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చెస్ ప్రతినిధులు ఐదుగురు కలిసి మద్రాసు హైకోర్టులో వేసిన సివిల్ దావా.

అమ్మకం పై నిషేధం

ఈ దావా విచారణలో వున్నప్పుడే ప్రాపర్టీ కంపెనీ కొన్ని ఆస్తులను అక్రమంగా అమ్మకానికి పెట్టింది. ఎస్టీబిసి ప్రతినిధులు ఆ విషయం కోర్టు దృష్టికి తేవడంతో, మొత్తం ఆస్తులలో ఏ ఒక్కదానినీ అమ్మడానికి లేదని, అమ్మినా చెల్లవని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది మద్రాసు హైకోర్టు. అయితే ప్రాపర్టీ కంపెనీ విజ్ఞప్తి మీదట, కొడైకెనాల్ వేసవి విడిది కేంద్రంలోని బంగ్లాను మాత్రం అమ్మడానికి అనుమతించింది. ఆ అమ్మకం, బహిరంగ వేలం ద్వారా జరగాలని, అమ్మగా వచ్చిన సొమ్మును బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని మాత్రమే వాడుకోవాలి తప్ప అసలు మొత్తాన్ని ఎట్టి పరిస్థితులలోనూ వాడుకోకూడదని నిషేధం విధించింది హైకోర్టు. దీనిపై మరికొంత న్యాయ వివాదం నడిచిన తర్వాత, 2000 సంవత్సరం జులై నెలలో మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్, ఏ ఒక్క ఆస్తిని అమ్మడానికి లేదని శాశ్వత ఇంజెక్షన్ ఉత్తర్వు జారీ చేసింది.

హక్కులేని అమ్మకం

ఈ మొత్తం వ్యవహారం పరిశీలిస్తే అర్థమయ్యే విషయం – అమెరికన్ ఆస్పత్రికి ఏకైక హక్కుదారు ప్రాపర్టీ కంపెనీ మాత్రమే అని. అయితే ఇప్పుడు దీనిలో రెండున్నర ఎకరాల భాగాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు, ఆస్పత్రికి అసలు హక్కుదారును పక్కన పెట్టి, ఎప్పుడో 1974లో రద్దు కావడంతో పాటు, అధికారికంగా ఈ ఆస్తుల మీద హక్కు వదలుకొన్న అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ దగ్గర కొనుగోలు చేశారు. ఎక్కడో నాగాలాండ్‌లో వున్న ఒక హిందు మతస్తుడు, ఈ అమెరికన్ సంస్థ తనకు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చి వుందని చెప్పాడని, అందువల్ల ఆయన ద్వారా కొనుగోలు చేశామని చెప్తున్నారు. నలభై ఏళ్ల క్రితం రద్దయిపోయిన సంస్థకు ఆస్తులమ్మే అధికారం ఎక్కడిదని ఒక్క నిముషం ఆలోచన చేసి వుంటే, ఈ దుస్సాహసానికి ఒడిగట్టి వుండేవారు కాదు.

కోర్టు ధిక్కారం నేరం

2000 సంవత్సరంలో హైకోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వులను ధిక్కరించి అమెరికన్ ఆస్పత్రి అమ్మడాన్ని సవాలు చేస్తూ, మద్రాసు హైకోర్టులో కోర్టు ధిక్కార దావా దాఖలు చేశాడు, ఖమ్మం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి. దీన్ని విచారించిన హైకోర్టు సంబంధితులందరి మీద కోర్టు ధిక్కార నేరం మోపుతున్నట్లు ప్రకటించింది. అమెరికన్ ఆస్పత్రి ఆవరణంలోని భవనాలను పదగొట్టకూడదని, చెట్లు పుట్టలు తొలగించకూడదని నిషేధం విధించింది. ఈ ఆస్పత్రి స్థలాన్ని అమ్మినవారే కాక, దాన్ని కొనేవారు కూడా కోర్టు ధిక్కార నేరం పరిధిలోకి వస్తారు.

జీతాల బాకీ సాకు

అమెరికన్ ఆస్పత్రిలో ఒక భాగాన్ని అమ్మకానికి పెట్టడానికి కారణం – ఉద్యోగుల జీతాల బాకీలు తీర్చడానికే అని చెప్తున్నారు. అది నిజం కూడా. 1999 నుంచి ఆస్పత్రి కష్టాలలో పడిపోయింది. ఉద్యోగులకు జీతాలివ్వలేదు. దానితో కార్మిక శాఖ అధికారులు ఆస్పత్రి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చారు. చట్టపరమైన చర్యలు చేపట్టారు. మరొకప్రక్క ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కూడా చర్యలు ప్రారంభించారు. కోర్టులలో కేసులు దాఖలయ్యాయి. 2006 జనవరి 24తేది హైకోర్టు సింగిల్ జడ్జి, దీనిపై ఒక తీర్పు వెలువరించారు. అందులో, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పక్షంలో ఆస్పత్రి ఆస్తులను వేలం ద్వారా అమ్ముకొనే స్వేచ్ఛ వుంటుందని వ్యాఖ్యానించారు. ఆ చిన్న మాటను ఆసరాగా తీసుకొని ఈ అమ్మకం జరుపుతున్నారిప్పుడు.

ఆస్తి ఎవరిది – అమ్మింది ఎవరు?

ఉద్యోగుల జీతాలు చెల్లించవలసిన బాధ్యత సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చెస్ సంస్థది. వారికి నిధులు సమకూర్చవలసిన కర్తవ్యం ప్రాపర్టీ కంపెనీది. కానీ వీరిద్దరితో సంబంధం లేకుండా అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ పేరిట పవర్ అటార్నీ పొందానని చెప్తున్న నాగాలాండ్‌కు చెందిన డాక్టర్ కె.ఇమోతెంజన్ అయ్యర్ అనే వ్యక్తి ఈ అమ్మకం జరిపాడు. ఆయనకు ఇటు అమెరికన్ ఆస్పత్రి ఆస్తులతో కానీ, అటు జీతాలతో కానీ ప్రమేయం లేదు.

అసలు యజమానుల మౌనం

తమకు తెలియకుండా తమ ఆస్తుల అమ్మకం జరుగుతున్నప్పుడు ప్రాపర్టీ కంపెనీ వ్యవహారాలు చూస్తున్న దివాకర్ అడ్డం వచ్చి వుండాలి. కానీ ఆయన విచిత్రమైన మౌనం పాటించాడు. జిల్లా కోర్టులో మాత్రం ఒక చిన్న కేసు వేసి, ఆ తర్వాత దాన్ని నీరు కార్చి వేశాడు. అందుకు కారణం, ఆస్తులు కొన్న వారితో ఆయనకు వ్యక్తిగతంగా కుదిరిన రాజీ అని చెప్తున్నారు.

మొత్తం మీద చూస్తే, అమెరికన్ ఆస్పత్రి అమ్మకం ఎంత మాత్రం చెల్లదని అర్థమౌతున్నది. ఈ ఆస్తికి అసలు యజమాని ప్రాపర్టీ కంపెనీ. కానీ అది అమ్మకం జరపలేదు. ఎప్పుడో 1974లో రద్దయి, ఆస్తుల మీద హక్కును అధికారికంగా వదలుకొన్న అమెరికన్ బాప్టిస్ట్ సంస్థ తరపు ప్రతినిధులు ఈ అమ్మకం జరిపారు. వారికా అధికారం లేదు. ఒక వేళ వుంది అనుకొన్నా, అమ్మకం పై మద్రాసు హైకోర్టు విధించిన నిషేధం అమలులో వుంది. క్రైస్తవ మత పెద్దలు, నెల్లూరు జిల్లా రాజకీయవాదులు చొరవ చూపితే, ఇప్పటికైనా అమెరికన్ ఆస్పత్రి ఆస్తుల అన్యాక్రాంతాన్ని నిలువరించవచ్చు. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఆ ఆవరణంలో మరొక ప్రజా సేవా సంస్థను నెలకొల్పవచ్చు.

ఇంత పెద్ద సంస్థను నాశనం చేసి, దాని నిర్వాహకులు సంపాదించింది కేవలం రెండంటే రెండు కోట్ల రూపాయలు మాత్రమే. ఆ స్వల్ప ధరకు దాన్ని విక్రయించారు. నిజానికి దాని రిజిస్ట్రేషన్ జరిగే నాటికి ప్రభుత్వ మార్కెట్ ధర ఎనిమిది కోట్లకుపైగా వుంది. అక్కడ అసలు మార్కెట్ ధర అంకణం రెండున్నర లక్షలు పలుకుతున్నది. దాని ప్రకారం ఈ రెండున్నర ఎకరాల స్థలం ఇరవై కోట్లు చేస్తుంది. కానీ చచ్చేవాడి పెళ్లికి వచ్చిందే కట్నం అన్న తీరులో ఇంత తక్కువ ధరకు అమ్మేశారు.

అమెరికనాస్పత్రి

5వ పేజీ కొరవ

పడి పోవడం ఒక విషాదం. దాని ఆనవాలు కూడా లేకుండా నేల మట్టం చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అనుమతించడం ఇంకా పెద్ద విషాదం.

ఉద్యోగులకు జీతాలివ్వాలనే సాకుతో ఆస్పత్రికి చెందిన రెండున్నర ఎకరాల భూమిని గుంటూరు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులకు అమ్మేశారు. వారి నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన ఒక వైశ్య ప్రముఖుడు కొనుగోలు చేశాడు. ఆ వెంటనే దానిలో వున్న భవనాలను కూలగొట్టి, స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టాడు. ఇంత పెద్ద సంస్థ ఇట్లా అన్యాక్రాంతమై పోతుంటే, నివారించవలసిన నెల్లూరు నగర రాజకీయ నేతలు, అదే వ్యాపార ుల నుంచి రౌడీ మామూళ్లు దండుకొని తమకేమీ పట్టనట్లు కళ్లు మూసుకొని వుండిపోతున్నారు. ఎక్కడో ఖమ్మం జిల్లా మధిరలో వుంటున్న ఒక క్రైస్తవ మత పెద్ద మాత్రమే ఈ అన్యాయాన్ని నిలువరించడానికి న్యాయపోరాటం చేస్తున్నాడు.

నెల్లూరు నగరంలో జిల్లాలో పౌర సమాజం ఎంత నిర్వీర్యమై పోతున్నదో అర్థం చేసుకోవడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇప్పటికైనా పలుకుబడి కల్గినవారు, పదవులలో వున్నవారు చొరవ చూపితే, ఈ అన్యాక్రాంతాన్ని నిలుపవచ్చు. విలువైన ఆ సంస్థ ఆస్తులను మరొక రూపంలో ప్రజలకు ఉపయోగపడేట్లు చూడవచ్చు. కానీ ఆ ఆశే కన్పించడం లేదు.

పద్మభూషణులు

మొదటి పేజీ కొరవ

భించాడు. కొత్తరకం ఉత్పాదన కావడంతో మొదట్లో విపరీతమైన నష్టాలు వచ్చాయి. కార్మిక సమస్యలు తలెత్తాయి. అయినా అధైర్యపడకుండా, ఏళ్లతరబడి ఓర్పు వహించి, దాన్ని నిలబెట్టాడు. ఆంధ్రా నుంచి అమెరికాకు వెళ్లి పరిశ్రమ స్థాపించిన మొట్ట మొదటి తెలుగువాడు జివికె. నార్త్ కరోలినా రాష్ట్రంలో 290 ఎకరాల విస్తీర్ణంలో నెలకొ ల్పారు దీన్ని.

1990 వరకు జివికె ఎదుగుదల మెల్ల మెల్లగా, తాబేటి నడకగా సాగింది. ఇక అక్కడి నుంచి కుందేటి పరుగులే. జేగురుపాడులో ప్రైవేటు యాజమాన్యంలో మొట్టమొదటి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించాడు జివికె. చాలా పెద్ద సాహసం అది. దేశంలోనే అటువంటి ప్రాజెక్ట్ ఎవరూ చేపట్ట లేదు. దానితో ఏ బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థా అప్పు లివ్వడానికి ముందుకు రాలేదు. అయినా తెగించి, స్నేహితుల సహకారంతో స్వంత డబ్బు వెచ్చించి కరెంట్ ఉత్పాదన ప్రారంభించే స్థాయికి తెచ్చాడు. ఆయన సాహసం, తెగువ, నైపుణ్యం చూసిన ఆర్థిక సంస్థలు అప్పటి నుంచి ఆయన వెంట పడడం ఆరంభించాయి. గత ఇరవై ఏళ్లలో జివికె పారిశ్రామిక సామ్రాజ్యం బహుముఖాలుగా విస్తరించింది. ముంబాయి, బెంగుళూరు నగరాలలోని ఎయిర్ పోర్టులు ఆయనవే. హైదరాబాద్‌లోని మూడు తాజ్ హోటళ్లతో పాటు, బెంగుళూరు, చెన్నై, చండీఘర్ వంటి నగరాలలోనూ హోటళ్లు నిర్మించాడు. ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ వంటి చోట్లా చాలా విద్యుత్ ప్రాజెక్ట్‌లు నిర్మాణంలో వున్నాయి. జైపూర్ నుంచి ఢిల్లీ వెళ్లే జాతీయ రహదారిని ఆధునీకరించడంలో జివికెది చాలా కీలక పాత్ర. జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లలో బొగ్గు గనులు చేపట్టారు. తమిళనాడులో ఒక ఎస్ఇజడ్ నిర్మిస్తున్నారు. ఇట్లా చెప్పు కొంటూపోతే జివికె పరిశ్రమలకు అంతమంటూ వుండదు. ఐదు వేల మెగావాట్ల జలవిద్యుత్, పది వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్, 5వేల గదుల హోటల్ చైన్, ఐదు మిలియన్ టన్నుల బొగ్గు, వెయ్యి కిలోమీటర్ల జాతీయ రహదారులు, కనీసం ఐదు అంతర్జాతీయ విమానాశ్రయాలు సాధించడం తన లక్ష్యంగా నిర్దేశించుకొన్నాడు జివికె. వీటి మొత్తం విలువ రెండు లక్షల కోట్ల రూపాయలు దాటుతుంది. అందుకోసం 75ఏళ్ల వయస్సులో కూడా పసి పిల్లవాడి వలె శ్రమిస్తున్నాడు. జివికె పారిశ్రామిక అభివృద్ధి వల్ల కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తున్నది. కాంట్రాక్టర్‌గా తనకు లభించిన సిరి సంపదలు, వాటితో కలిసి వచ్చే విలాసాలతో సంతృప్తి పడి వుంటే జివికె మరొక సంపన్నుడిగా మాత్రమే మిగిలిపోయేవాడు. కానీ ఏదో సాధించాలనే తృష్ణ, అందుకోసం పట్టుదల, లక్ష్య దీక్షలతో కష్టపడి పని చేయడం వల్ల, కష్టాలను ఎదుర్కొని విజయం సాధించడం వల్ల ఈరోజు జివికె పద్మభూషణ్ స్థాయిని చేరుకొన్నాడు

● నామమాత్రంగా

జాతీయ ఓటర్ల దినోత్సవం

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా తొలి సారిగా ఓటర్ల దినోత్సవం నిర్వహించాలని భావించింది. ఇందులో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు స్థానిక ఓటర్లను ఆహ్వానించి ఓటు నమోదు గురించి అవగాహన కల్పించాలని నిర్ణయించింది. జనవరి 25వ తేది నాడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరపాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలు కొన్ని ప్రాంతాలలో అమలు కాలేదు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులను నియమించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

15 రోజుల ముందుగానే ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవం జరపాలని జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని మండల తహశీల్దార్‌లకు దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరినప్పటికి కొన్ని మండలాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారు. కొత్తగా ఓటరుగా నమోదైన వారికి పోలింగ్ కేంద్రాల వద్దనే గుర్తింపు కార్డు అందజేస్తారని ప్రకటించారు. అలాగే ఓటర్ల చేత భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, జాతి, మత, కులం, వర్గం భాషా బేధాలు లేకుండా ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రమాణం చేయించాలి.

పట్టణ ప్రాంతాల్లో మాత్రమే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం కొంతమేర జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో విఆర్వో, పంచాయితీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించడంతో సక్రమంగా నిర్వహించలేక పోయారు. జిల్లాలో వ్యవసాయ పనులు జరుగుతుండడంతో గ్రామీణ ప్రాంత ఓటర్లు ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. మరోప్రక్క 24 నుంచి రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో రెవెన్యూ యంత్రాంగం ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి దూరంగా వుండాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల దినోత్సవం నిర్వహించే దానిపై ప్రచారం చేసిన దాఖలాలు కనిపించలేదు.

కొన్ని గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడి వర్కర్లు ఓటర్లను పిలిపించి తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ముగించారు. ఎన్నికల సంఘం ఓటర్లకు ఓటుహక్కుపై మరింత అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ప్రారంభదశలోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయలేకపోయారు. విఆర్వోలు, గ్రామపంచాయితీ కార్యదర్శులు ఫోటోగ్రాఫర్లను తీసుకొచ్చి ఫోటోలు తీయించి ఘనంగా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఉన్నతాధికారులకు చూపించుకుని మెప్పుపొందేందుకు ప్రయత్నించారు.

ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారి పేర్లు సక్రమంగా సరి చేయడం లేదని ఈ కార్యక్రమానికి హాజరైన కొంతమంది ఓటర్లు సిబ్బందిని నిలదీశారు. ఎన్ని దఫాలు దరఖాస్తులు అందజేసినా చేసిన పొరపాట్లను సరిదిద్దలేక పోయారని ప్రశ్నించారు. ఓటరు జాబితా తయారీ గురించి ఎటువంటి సంబంధం లేని వారు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో సరైన సమాధానం చెప్పలేక మౌనంగా వుండిపోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసుకోలేకపోయింది.



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్. వేదికపై డిఆర్వో జయరామయ్య, జెసి సౌరబ్‌గౌర్, వైస్ ఛాన్సలర్ విశ్వేశ్వరరావు, నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి.

హజ్ యాత్రికులకు కరదీపిక

మక్కాను సందర్శించే యాత్రను హజ్ అనే పేరుతో పిలుస్తారు. హజ్ అంటే అల్లా వైపు చేసే ప్రయాణం అని అర్థం. ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒకసారైనా తప్పని సరిగా చేయాల్సిన మతపరమైన పవిత్ర విధి హజ్ యాత్ర. ఈ యాత్ర సంవత్సరంలో నిర్దేశిత హజ్ నెలలోనే చేయాలి. ఇక సంవత్సరంలో ఎప్పుడైనా మక్కాకు చేసే యాత్రను ఉమ్రా అంటారు. ఉమ్రా అంటే ప్రముఖ యాత్రా స్థలాన్ని సందర్శించడం అని అర్థం. అయితే ఇది ఖచ్చితమైన విధి కాదు. హజ్ యాత్ర ఇస్లాంలోని ఐదు కీలక అంశాలలో ఒకటి. ఈ యాత్రల సందర్భంలో ప్రతి ముస్లిం తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేయాల్సిన 'దువా'లను (ప్రార్థనలను), ఆచరించాల్సిన క్రతువులను తెలియజేస్తూ షేక్ ఎమ్మెస్ సల్మాన్ రాసిన 'హజ్, ఉమ్రాలకు మార్గదర్శకాలు' అనే పుస్తకం హజ్ యాత్రీకులే కాక ఆసక్తివున్న వారందరికీ పఠనీయం.

జెడ్డా దేశంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న సల్మాన్ సౌదీ అరేబియాలోని తెలుగు ముస్లింల కోసం రాసిన ఈ పుస్తకాన్ని ఫాతిమా బుక్స్ పబ్లిషింగ్ హౌస్‌వారు ఆంధ్ర హజ్ యాత్రీకుల ఉపయోగార్థం ప్రచురించారు. నిజానికి తెలుగులో హజ్ యాత్ర విధి, విధానాలను తెలిపే సమగ్రమైన పుస్తకం ఏదీ లేదు. ఆ లోటును కొంత వరకు ఈ రచన తీరుస్తుంది.

ఈ పుస్తకంలో హజ్‌లోని వివిధ రకాలను, హజ్ చేసే విధానాలను, ఇహ్రామ్ విధులను సరళంగా వివరించారు. హజ్ మూలస్థంభాల వివరణను క్లుప్తంగా అందించారు. అంతే కాకుండా యాత్రికులు చేసే పొరపాట్లను సైతం వివరంగా చర్చించడం విశేషం. హజ్, ఉమ్రా యాత్రల్లో పాటించాల్సిన నైతిక సూత్రాలు, చేయాల్సిన దువాలు, అనుసరించాల్సిన విధి విధానాలను కూలంకషంగా తెలియజేశారు రచయిత.

హజ్ యాత్ర 7వ శతాబ్దానికి పూర్వం నుంచి జరుగుతున్నట్టు ఆధారాలున్నాయి. హజ్ యాత్ర వివిధ దేశాలలో నివసించే ముస్లిం మతస్థుల మధ్య సమైక్యతకు చిహ్నం. హజ్ యాత్ర ప్రాముఖ్యత రోజు రోజుకూ పెరుగుతూనే వుంది. గడచిన సంవత్సరంలో మూడు మిలియన్లకు పైగా ముస్లింలు మక్కాను సందర్శించారంటే ఈ యాత్రల ప్రాముఖ్యం అర్థం చేసుకోవచ్చు. అటువంటి యాత్రకు తెలుగులో మార్గదర్శనం చేస్తూ వెలువడిన ఈ పుస్తకం హజ్, ఉమ్రా యాత్రీకులకు పాకెట్ గైడ్‌గా చక్కగా ఉపయోగపడుతుంది. అయితే ప్రభుత్వ హజ్ కమిటీ వివరాలు, హజ్ యాత్రకు ఆర్థిక సహాయం పొందే వివరాలు కూడా ఈ పుస్తకంలో పొందుపరచి వుంటే ఈ పుస్తక ప్రయోజనం మరింత విస్తృతం అయివుండేది. హజ్, ఉమ్రా యాత్రీకుల ఉపయోగార్థం ఈ పుస్తకాన్ని ఫాతిమా బుక్స్ వారు పోస్టల్ ఖర్చులు రూ.10/-లు పంపితే ఉచితంగా అందజేస్తారు.

పుస్తక సమీక్ష

హజ్, ఉమ్రాలకు మార్గదర్శకాలు

రచయిత : **షేక్ ఎమ్మెస్ సల్మాన్**

సమీక్షకుడు : **ధనిశెట్టి లెనిన్**

ప్రతులకు : ఫాతిమా బుక్స్ పబ్లిషింగ్ హౌస్,
11-5-410, ఫ్లాట్ నెం:402, లిల్లీ బ్లాక్,
నయీముల్ ఖాసిం అపార్ట్‌మెంట్స్, రెడ్‌హిల్స్, హైదరాబాద్-04

● బోసిపోయిన

ప్రభుత్వ కార్యాలయాలు

పెన్‌డౌన్‌తో వుద్యోగుల విజయం



రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతవారం జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు పెన్‌డౌన్ నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు రెండు రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమం జరిగింది. ఉద్యోగులు రెండు రోజుల పాటు విధులకు గైర్హాజరు కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయి కనిపించాయి. కార్యకలాపాలు మొత్తం స్తంభించిపోయాయి. ఉద్యోగులు తలపెట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం విషయం తెలియని పల్లె ప్రజలు పనుల నిమిత్తం వచ్చి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. కలెక్టరేట్ ఉద్యోగులు విధులకు హాజరుకావడం బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేయడంలో భాగంగా ఆడిన క్రికెట్, కోకో, కబాడీ, కుందుడుగుమ్మ, తొక్కుడు బిళ్ల ఆటలు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తాయి. మొత్తం మీద పెన్‌డౌన్‌తో ఉద్యోగులు తాము కోరుకున్న కోరికలను ప్రభుత్వం మెడలు వంచి రెండు మూడు రోజులలోనే విజయం సాధించగా జనం మాత్రం ముఖ్యమైన పనులన్నీ ఆగిపోయి నానా పాట్లు పడ్డారు. ఏ సమస్యలొచ్చినా ప్రజలకేగా?

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

జగన్ చుట్టూ ఉచ్చు!



జైలు జగన్ అక్రమార్జనపై పరిశీలన చేపట్టింది హైకోర్టు. జగన్ ఆర్థిక చరిత్ర సమస్తం ప్రభుత్వ ఖజానా దోపిడీ మయం అన్న సంగతి అందరికీ తెలుసు. కాంగ్రెస్ అధిష్టానం అదును చూసి దెబ్బ కొడుతుందని, ఏదో ఒక శుభ ముహూర్తాన సిబిఐని రంగంలోకి దింపి జగన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుందని భావిస్తుండినారు అందరూ. ప్రణబ్ ముఖర్జీ దగ్గర జగన్ వ్యాపారాల జాతకాలన్నీ సిద్ధంగా వున్నాయని కూడా ప్రచారం జరిగింది. కానీ ఎందువల్లనో కాంగ్రెస్ పెద్దలు ఆ జోలికి వెళ్లలేదు. జగన్ నేరుగా ఢిల్లీకే వచ్చి తమ అధికారాన్ని సవాలు చేసి వెళ్లినా, సోనియా గాంధీని నోరారా తిడుతున్నా వులుకు పలుకు లేకుండా కాలక్షేపం చేస్తున్నారు. కానీ కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు ఇప్పుడు హైకోర్టు ఆ బాధ్యతను తన తలకెత్తుకొంది. జగన్ సంస్థలలో పెట్టుబడి పెట్టిన వారందరికీ నోటీసులు ఇవ్వడంతో పాటు, సిబిఐ దర్యాప్తు కోణంలో కేంద్ర హోం శాఖనూ వివరణ కోరింది. దీనివల్ల జగన్‌కు ప్రత్యక్షంగా వచ్చే ఇబ్బంది పెద్దగా వుండకపోవచ్చు. ఎప్పటికైనా ఈ ప్రమాదం తప్పదని జగన్‌కు తెలుసు కాబట్టి, అందుకు తగిన ఏర్పాట్లన్నీ ముందుగానే చేసుకొన్నాడని చెప్తారు. అయితే ఆయన సంస్థలలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికులకు తల ప్రాణం తోకకు రాక తప్పదు. వారి చరిత్రలన్నీ త్రవ్వి తీస్తుంది సిబిఐ. దర్యాప్తు పేరిట చీటికి మాటికి పిలిచి, గంటల పర్యంతం నిలబెడుతుంది. బ్యాంక్ ఖాతాలు స్థంబింప చేస్తుంది. సూది కోసం సోదికి పోతే, పాత రంకులన్నీ బయటపడినట్లు వ్యాపారాలలో అలవాటుగా చేసే తప్పులు ఏవేవి బయటకు వస్తాయో తెలియదు. ఆ వూహనే భరించలేక పోతున్నారు ఈ పారిశ్రామికులు. వీరందరినీ బిగ పట్టడం ద్వారా జగన్‌కు కొత్తగా నిధుల ప్రవాహం రాకుండా అడ్డు పడడం ఒక్కటే దీనివల్ల జగన్‌కు కలిగే నష్టం.

జగన్ చుట్టూ అధిష్టానం పన్నుతున్న నిజమైన ఉచ్చు రాజకీయ పరమైనది. ఆయన వెంట వెళ్లిన ఎమ్మెల్యేల మీద సామ దాన బేధ దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. ఒకరొకరిగా వెనక్కు లాగుతున్నారు. మరొకప్రక్క అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం పెట్టమని సవాళ్లు చేస్తూ ఇరకాటంలో పెడుతున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే, స్పీకర్‌కు నోటీసు ఇవ్వాలి. అది ప్రభుత్వ వ్యతిరేకం కాబట్టి, దాని మీద సంతకం పెట్టిన మరుక్షణం శాసనసభ్యులుగా అర్హత కోల్పోతారు. దానితో అంగీ చెడే మంగీ చెడే అన్నట్లు తయారౌతుంది పరిస్థితి. ఏ తెలుగుదేశం పార్టీనో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడితే జగన్‌కు లాభం. తీర్మానం మీద ఓటింగ్ జరిగే వరకు తన ఎమ్మెల్యేల పదవి పోకుండా చూసుకోవచ్చు. ఓటింగ్‌లో ప్రతిపక్షంతో కలిసి ఓటు చేస్తే, ప్రభుత్వం పడిపోతుంది. ఆ తర్వాత తమ ఎమ్మెల్యేలకు పదవి పోయినా ఇబ్బంది లేదు. ఆ తర్వాత ఎటూ ఎన్నికలే శరణ్యం కదా? కానీ జగన్ కోరిక తీరేట్లు లేదు. చంద్రబాబు ఇప్పట్లో అవిశ్వాసం పెట్టి, జగన్‌కు లాభం చేకూరే పని చేయడు. పైగా ఇప్పటికిప్పుడు ఎన్నికలకు ఆయన సిద్ధంగా లేడు. కాంగ్రెస్ పార్టీ మరింత భ్రష్టుపట్టి, కేసులు, అరెస్టులతో జగన్ బలహీనమైన తర్వాత ఎన్నికలు రావాలని ఆయన కోరుకొంటున్నాడు. అవిశ్వాసం పెట్టకుండా, ఎన్నికలు వచ్చే పరిస్థితి కల్పించకుండా ఎమ్మెల్యేలను కాపాడుకోవడం జగన్‌కు వీలయ్యేట్లు కన్పించడం లేదు. ఒకరొకరుగా జారిపోతున్నారు వారు. ఆ సంఖ్య తగ్గితే జనంలో కూడా ఇమేజ్ పడిపోతుంది. ఎన్నికలు మరొక రెండు మూడేళ్లు రాకుంటే జగన్ రాజకీయ పార్టీ పెట్టడం దుస్సాహసంగా మారడం ఖాయం. అప్పటి వరకు ఈ వూపు నిలబెట్టుకోవడం సాధ్యమయ్యే పని కాదు.

ఒక్క కడప ఉప ఎన్నికలో మాత్రం జగన్ కాంగ్రెస్ కంటే ముందు మిగిలాడని పరిశీలకుల అభిప్రాయం. ఆ జిల్లా మంత్రి డిఎల్.రవీంద్రరెడ్డి ఎన్ని బీరాలు పలికినా కడపలో జగన్ ప్రాభవాన్ని నిరోధించే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ లేదు. పులివెందులలో ఎన్నిక నామమాత్రం. అయినాసరే వైఎస్.వివేకానందరెడ్డిని అక్కడే పోటీ పెట్టబోతున్నారు. వైఎస్ మరణించాడన్న సానుభూతి ముందు, వివేకానందరెడ్డి మంచితనం నిలవగలదని ఎవరూ కల కూడా కనడం లేదు. కడప లోక్‌సభ నియోజకవర్గంలో జగన్‌కు పోటీ ఇవ్వగల అభ్యర్థి కాంగ్రెస్ పార్టీకి దొరకడం లేదు. డిఎల్. రవీంద్రరెడ్డిని అందుకు పురికొల్పాలి. అయితే అటు వివేకానందరెడ్డి, ఇటు డిఎల్.రవీంద్రరెడ్డి ఎన్నికలలో అభ్యర్థులైపోతే, ఎన్నికల నిర్వహణ ఎవరు చేస్తారు?

Before the VI Addl. Motor Accident Claims Tribunal, Nellore
O.P.No:110/2010

1.Nellore Ramanamma and others... Claimants
Vs

1. A.Varada Reddy and others... Respondents

To, R/1 A.Varada Reddy s/o Subba Reddy, Kondayapalem Village, Nellore Corporation, Nellore.

నోటీసు

పై నెంబరున క్లయిమెంట్ మీ పై నష్టపరిహారము కోరుతూ పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం 02.02.2011తేదిన వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

G.Jayachandra Raju, B.Com., B.L.,
క్లయిమెంట్ తరపు అడ్వకేటు, నెల్లూరు.

తుస్సుమన్న తెలంగాణ

బడ్జెట్ పెట్టేవరకు మౌనవ్యూహం పాటించాలని కెసిఆర్‌కు ప్రణబ్ సలహా యివ్వడంతో దాన్ని అనుసరిస్తున్నారాయన.

కొండంత రాగం తీసి కొసన తుమ్మెద కూచున్నట్లయ్యింది తెలంగాణ ఉద్యమం పరిస్థితి. శ్రీకృష్ణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత భూకంపం పుట్టిస్తామని, ప్రళయం సృష్టిస్తామని భీకర ప్రతిజ్ఞలు చేసిన టిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మౌనం వహిస్తున్నాడు. అటు తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్పీల రాజీనామాలతో రాజ్యాంగ సంక్షోభం కానీ; ఇటు జెఏసి ఉద్యమ కార్యాచరణతో వీధి పోరాటాలు కానీ లేకుండా నిశ్శబ్దంగా కాలం గడిపేస్తున్నాడు. అందుకు ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది – బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఓపిక పట్టమని ప్రణబ్ ముఖర్జీ విజ్ఞప్తి చేశాడన్న వాదన. ఇప్పుడే రాజీనామాల డ్రామాలు నడిపితే బడ్జెట్ ఆమోదం కష్టమైపోతుంది. అది జరగకుంటే ఏప్రెల్ ఒకటో తేది నుంచి జీతాలు కూడా ఇవ్వలేని రాజ్యాంగ సంక్షోభం తలెత్తుతుంది. బడ్జెట్ ఆమోదమయ్యే వరకు ఓర్పు వహిస్తే, ఆ తర్వాత నువ్వు చెప్పినట్లే వినుకొంటామని ప్రణబ్ బేరం పెట్టాడని చెప్తున్నారు. రెండవ కారణం – ఉద్యమాన్ని ఉధృతం చేస్తే హింస ప్రబలే ప్రమాదం. ఉద్యమంలో హింస చోటు చేసుకొంటే పోలీసు బలప్రయోగంతో అణచి వేయడానికి గవర్నర్ సిద్ధంగా వున్నాడు. ఒకసారి ఉద్యమం చల్లారితే మళ్లీ ఆ నిప్పు రాజేయడం చాలా కష్టం. 1969, 1972 ఉద్యమాలు రెండింటికీ అదే గతి పట్టిన చరిత్ర తెలిసినవాడు కాబట్టి, సంయమనంతో వ్యవహరిస్తున్నాడు కెసిఆర్. ఎన్నికలు, రాజ్యాంగ సంక్షోభాల రూపంలోనే తెలంగాణ ఉద్యమం నడపాలన్నది కెసిఆర్ అభిమతం. అందుకే ఓపిక పడుతున్నాడని చెప్తున్నారు.

కారణం ఏదైనా తెలంగాణలో ఉద్యమం వేడి బాగా క్షీణించింది. జనంలో, మరీ ముఖ్యంగా అది నివురుగప్పిన నిప్పు వలె దాగి వుందన్నది కాదనలేని సత్యం. కానీ ఇప్పటికిప్పుడు ఆ నిప్పు నుంచి మంటల ఎగిసిపడే అవకాశం లేదు. ఇప్పటికిప్పుడు ఈ ఉద్యమం వల్ల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి వచ్చే ప్రమాదం కూడా ఏదీ లేదని అర్థమౌతున్నది. కెసిఆర్ వెనక్కు తగ్గితే తెలుగుదేశం పార్టీ, గద్దర్‌లు కలిసి ఉద్యమాన్ని తమ చేతులలోకి తీసుకొంటారనే భయం ఒకటి వుండింది. కానీ వారికా సమర్థత లేదని తేలిపోయింది. దీన్నిబట్టి, మరొక నాలుగైదు నెలల కాలం తెలంగాణలో శాంతి కొనసాగుతుందని భావిస్తున్నారు.



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.